



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 90 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 10 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 90 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 10 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## అమెరికాతో ఉద్రిక్తతలు..

## 37 ఏళ్ల సంప్రదాయానికి ఖమేనీ బ్రేక్

- 37 ఏళ్లలో తొలిసారి ఎయిర్‌ఫోర్స్ సమావేశానికి గైర్హాజరైన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ
- అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఈ అనూహ్య పరిణామం
- గల్ఫ్ ప్రాంతంలో భారీగా సైనిక బలగాలను మోహరిస్తున్న అమెరికా
- అమెరికా దాడి చేస్తే యుద్ధం తప్పదని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు

- మిగతా 2లో...





తొలి ఎన్నికల బరిలో విజయ్..

## రెండు నియోజకవర్గాల నుంచి పోటీ!

- చెన్నైలోని విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలపై విజయ్ గురి
- పట్టణ, ప్రాంతీయ ఓటర్లను ఆకట్టుకునేందుకు పక్కా వ్యూహం
- రెండు స్థానాల్లోనూ అధికార డీఎంకేతోనే విజయ్ ప్రధాన పోటీ

- మిగతా 2లో...

## ఉత్పత్తులకు బ్రాండింగ్, నాణ్యతే ముఖ్యం

- స్వయం సహాయక సంఘాల కోసం 'స్వయం' పేరుతో ప్రత్యేక బ్రాండ్
- రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్న సీఎం
- రూ.300 కోట్లతో ఎస్టీపీల నిర్మాణం వేగవంతం చేయాలని సూచన



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు మంత్రులు, కార్యదర్శులతో కీలక సమావేశం నిర్వహించారు. ఐదో బ్లాకులో జరిగిన ఈ సమావేశంలో ప్రొడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, గ్రీన్ కవర్ వంటి పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. నాణ్యమైన ఉత్పత్తులకు సరైన బ్రాండింగ్ జోడిస్తేనే మెరుగైన మార్కెట్ సాధ్యమవుతుందని, ఈ దిశగా అధికారులు దృష్టి సారించాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తుల కోసం 'స్వయం' అనే పేరుతో ప్రత్యేక బ్రాండ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బ్రాండ్ ద్వారా వారి ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్ అందుబాటులోకి వస్తుందన్నారు. అరకు కాఫీ తరహాలోనే కోకో పంటకు కూడా మంచి బ్రాండ్ తీసుకురావాలని సూచించారు.పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలని ఆదేశించారు. నగరాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్టీపీ) నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ చేపట్టాలన్నారు. రూ.300 కోట్ల వ్యయంతో ఈ ప్లాంట్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, దీనికి అవసరమైన నిధులను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) సమకూరుస్తుందని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నిధులతో పేరుకుపోయిన చెత్తను (లెగసీ వేస్ట్) వేగంగా తొలగించాలని స్పష్టం చేశారు.

**50శాతం పచ్చదనమే లక్ష్యం**

రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఉగాది నుంచి పాఠశాలల్లో దేశీయ వృక్ష జాతుల పెంపకంపై ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. తీరప్రాంత కోత నివారణకు ఉపముఖ్యమంత్రి చేపట్టిన ప్రాజెక్టును అభినందించిన సీఎం, కోతను అరికట్టడంతో పాటు రైతులకు ఆదాయం అందించేలా ఆర్కిడ్స్ సాగును ప్రోత్సహించాలని సూచించారు.



## అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు.. అయినా జైలుకే!

- సీఎంపై వ్యాఖ్యల కేసులో అంబటి రాంబాబుకు బెయిల్
- విడుదలవుతున్న సమయంలోనే మరో కేసు తెరపైకి
- పోలీసులతో దురుసు ప్రవర్తన కేసులో 14 రోజుల రిమాండ్
- ఈ నెల 22 వరకు అంబటికి జ్యుడీషియల్ కస్టడీ
- తిరిగి రాజమహేంద్రవరం జైలుకే అంబటి

- మిగతా 2లో...



స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసానికి

## విపక్షాల ప్లాన్..

ముదురుతున్న లోక్‌సభ వివాదం

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన విపక్షాలు
- ప్రధానిపై దాడి జరగొచ్చన్న స్పీకర్ వ్యాఖ్యలతో రాజుకున్న వివాదం
- 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్‌తో మరింత పెరిగిన రాజకీయ వేడి

2లో...

పెన్ పవర్ డెస్క్: కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య తీవ్రమవుతున్న విభేదాల నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస



'పరీక్షా పే చర్చ'లో దేశ నిర్మాణంపై

## విద్యార్థులకు మోదీ పాఠాలు

- వికసిత భారత్ గురించి విద్యార్థులు ఆలోచించడంపై ప్రధాని మోదీ హర్షం
- అన్నం వృథా చేయకపోవడం దేశ నిర్మాణంలో భాగమేనని సూచన
- విజయానికి క్రమశిక్షణే పునాది అని విద్యార్థులకు ప్రధాని స్పష్టీకరణ
- 'పరీక్షా పే చర్చ'లో విద్యార్థులతో ముచ్చటించిన ప్రధాని మోదీ

- మిగతా 2లో...

పంజాబ్ సీఎం విదేశీ పర్యటనకు

## అనుమతినివ్వని కేంద్రం

- వివాదంగా మారిన పొలిటికల్ క్లియరెన్స్ నిబంధన
- సీఎంల ఫారిన్ టూర్లకు విదేశాంగ శాఖ అనుమతి తప్పనిసరి
- కక్ష సాధింపు చర్యలంటూ కేంద్రంపై ఆప్ మండిపాటు

పెన్ పవర్ డెస్క్:పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ విదేశీ పర్యటనపై కేంద్ర ప్రభుత్వం మరోసారి నీళ్లు చల్లింది. యూరప్ లో పర్యటించేందుకు మాన్ విదేశాంగ శాఖ అనుమతి కోరగా తిరస్కరించింది. దీంతో ముఖ్యమంత్రి మాన్

- మిగతా 2లో...





## ఎంఐఎం మద్దతు లేకుండా కాంగ్రెస్ గెలిచిందా?


- రెడ్లు అయినా, రావులు అయినా తమ దగ్గరకు రావాల్సిందే అన్న ఒవైసీ
- మున్సిపల్ ఎన్నికల్లో తమ సత్తా ఏంటో చూపుతామని వ్యాఖ్య
- ముఖ్యమంత్రులే తమ దగ్గరకు రావాలన్న ఒవైసీ

పెన్ పవర్ డెస్క్: రెడ్లు అయినా, రావులు అయినా తమ దగ్గరకు రావాల్సిందేనని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రుల దగ్గరకు తాము వెళ్లమని, వాళ్లే తమ దగ్గరకు రావాలని అన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎంఐఎం మద్దతు లేకుండానే కాంగ్రెస్ గెలిచిందా?

- మిగతా 2లో...

ఏపీలో నియోజకవర్గాలకు ర్యాంకులు..

## ఎమ్మెల్యేల పనితీరుకు మార్కులు..



- ఏపీలో 175 నియోజకవర్గాల పనితీరుపై ప్రభుత్వ ర్యాంకులు
- 93 శాతం మార్కులతో ప్రథమ స్థానంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం
- రెండో స్థానంలో నిలిచిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు నియోజకవర్గం గాజువాక
- AG గ్రేడులో 21, A గ్రేడులో 153, B గ్రేడులో ఒకే ఒక్క నియోజకవర్గం
- ఎమ్మెల్యేల పనితీరు, పథకాల అమలు ఆధారంగా ర్యాంకుల కేటాయింపు

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# సుప్రీం తీర్పు: టీచర్స్‌పై ప్రభావం

2011 కంటే ముందు ఉపాధ్యాయులుగా చేరిన వారికి రెండు సంవత్సరాల లోపు టెట్ పరీక్షను ఉత్తీర్ణత సాధించాలని లేకుంటే ఉద్యోగాన్ని వదులుకోవాల్సి వస్తుందని దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి, మానసిక సంఘర్షణకు గురవుతున్నారు. తెలంగాణ లోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, ఎయిడెడ్, ఇతర పాఠశాలలలో పనిచేసే టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్ (టెట్)తో భయాందోళనకు గురవుతున్నారు. సుప్రీంకోర్టు 31 ఆగస్టు, 2025 న ప్రతి ఒక్క టీచర్ టెట్ ఉత్తీర్ణత సాధించాలని లేదా ఉద్యోగం వదులుకోవాల్సి వస్తుందని ఉత్తర్వులు జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన విధానం అనుసరిస్తుందో అని టీచర్స్ ఎదురుచూస్తున్నారు. 2009లో విద్యా కమిషన్ వచ్చిన తర్వాత 2010 నుండి టెట్ అమలులోకి వచ్చింది. టెట్ అమలులోకి వచ్చిన తరువాత 2012, 2017, 2024 మూడుసార్లు టీచర్స్ రిక్రూట్‌మెంట్ జరిగింది. టెట్ వారికి అమలులోకి వచ్చింది. అంతకు ముందు జరిగిన టీచర్స్ రిక్రూట్‌మెంట్‌లో టెట్ అమలులో లేదు. సుప్రీంకోర్టు తీర్పులో ఐదు సంవత్సరాల లోపు పదవీ విరమణకు దగ్గర ఉన్న వాళ్ళకు మినహాయింపు ఇచ్చారు. 1996 నుండి టీచర్స్‌గా ఉన్న వాళ్ళకు, 30 సంవత్సరాలు కావస్తున్న 50 సంవత్సరాలు దాటిన వాళ్ళు అనేక మంది ఉన్నారు. వాళ్ళలో కంటి చూపు, మోకాళ్ళనొప్పులు, ఇతర అనారోగ్యాలతో బాధపడుతున్న వాళ్ళు అనేక మంది ఉన్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి మినహాయింపు ఇవ్వడం కనీస న్యాయం. ప్రధానోపాధ్యాయ పదోన్నతిలో 50 సంవత్సరాలు దాటిన వారికి డిపార్ట్‌మెంట్ పరీక్ష నుండి మినహాయింపు ఉంది. 2024 సంవత్సరంలో ఎన్‌సిటిఇ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వివరణ కోరితే 2010 కంటే ముందు టీచర్స్‌కు టెట్ అవసరం లేదని వివరణ ఇచ్చారు. ప్రస్తుతం సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు 30 నుండి 40 వేల మంది టీచర్స్‌పై ప్రభావం పడుతుంది. భాషోపాధ్యాయులు ఉర్దూ, కన్నడ ఇతర దేశ భాషలలో బోధించే ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్‌లో పేపర్ 3 నిర్వహిస్తున్నారు. తెలంగాణలో భాషోపాధ్యాయులకు సాంఘిక శాస్త్రం 60 మార్కులకు కేటాయించడం వలన అనేక మంది తెలుగులో ఉత్తీర్ణత సాధించడం లేదు. ముఖ్యంగా తెలుగు భాషలో నిర్వహించాలని అన్ని ఉపాధ్యాయ సంఘాలు కోరుకుంటున్నారు. బయాలజీ ఉపాధ్యాయులకు గణితం, భౌతిక శాస్త్రంలో పరీక్షలు నిర్వహించడం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను, వారి మానసిక వేదనను అర్థం చేసుకొని పేపర్ 3 నిర్వహించి భాషోపాధ్యాయులకు న్యాయం చేయాలి. ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు 60 మార్కులు, బిసిలకు 75 మార్కులు, ఒసిలకు 90 మార్కులు రావాలనడం సమంజసంగా లేదు. ఏ పరీక్షలలోనైనా 35 మార్కులకే ఉత్తీర్ణత ఉంటుంది. అలాంటిది టెట్‌లో 90 మార్కులు రావాలన్న నియమం ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తుంది. కులప్రాతిపదికన మార్కులు కేటాయించడం ఏ పరీక్షలలోనూ లేదు. ఒక పాఠశాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి నలుగురు ఉపాధ్యాయులు ఉంటే నలుగురిలో ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయులకు 65% మార్కులు, బిసి ఉపాధ్యాయుడికి 77 మార్కులు, జనరల్ (ఒసి) ఉపాధ్యాయుడికి 89 మార్కులు అందరి కంటే ఎక్కువ వచ్చినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఉపాధ్యాయులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రకటించి జనరల్ ఉపాధ్యాయుడు ఉత్తీర్ణత కాలేదు అనడం విశేషం. సమాజం దృష్టిలో, విద్యార్థుల తల్లిదండ్రుల దృష్టిలో, వారి భార్యాబంధువుల దృష్టిలో టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించని ఉపాధ్యాయుడిగా చిన్నచూపు. టెట్ పరీక్ష అంటే ఉపాధ్యాయ అర్హత పరీక్ష 25, 30 సంవత్సరాల నుండి పదవ తరగతి విద్యార్థులకు బోధించి, ఉత్తమ పౌరులను తయారు చేసి కొంత మంది విద్యార్థులే ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించేటట్లు సలహాలు, సహకారం అందించి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం చేత, స్వేచ్ఛంద సంస్థల చేత ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానింపబడి టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించనంత మాత్రాన ఉపాధ్యాయ వృత్తికి పనికి రాదనడం ఏ రకమైన నీతి, న్యాయం, ధర్మమో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సిఆర్‌టిఇ) ఆధ్వర్యంలో పుస్తక రచయితలుగా ఉన్నవారు టెట్ పరీక్ష ఉత్తీర్ణత సాధించలేదు కాబట్టి ఉపాధ్యాయుడిగా అర్హత లేదు అనడం సమంజసమేనా? భాషోపాధ్యాయులు (తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడం, తమిళం ఇతర దేశీయ భాషలు)బయోలజీ బోధించే ఉపాధ్యాయులకు వారు బోధించే సబ్జెక్టులో టెట్ పరీక్షను నిర్వహించకుండా వారికి సంబంధం లేని ఆంగ్లం, సాంఘికశాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రం, మానసిక శాస్త్రంలో పరీక్షలను నిర్వహించి ఉత్తీర్ణత సాధించాలని అనడం విచారించదగిన విషయంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెట్ పరీక్ష ఉపాధ్యాయ అర్హత పరీక్ష మాదిరిగా డాక్టర్ అర్హత పరీక్ష, న్యాయవాద అర్హత పరీక్ష, ఇంజినీర్ అర్హత పరీక్ష అంటూ ఏ వృత్తిలో లేని అర్హత పరీక్ష ఉపాధ్యాయులకు మాత్రమే నిర్వహించడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెట్ ఉత్తీర్ణత సాధించకుంటే పదోన్నతి రాదనడం, ఉద్యోగం వదులుకోవలనడం ఇదేమి న్యాయమని అనేకమంది ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. విద్య ఉమ్మడి జాబితాలో ఉండడంవల్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏ రకమైన విధానం అమలు చేస్తుందో అని ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీచర్స్‌గా 2010 కంటే ముందు ఉన్న వాళ్ళకు టెట్‌నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుకుంటున్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్‌టిఎఫ్) ఆధ్వర్యంలో దేశరాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు శ్రీపాల్ రెడ్డి కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పదవీవిరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు నగదు రహిత హెల్త్ కార్డుల కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయడం గొప్ప పరిణామంగా వారు భావిస్తున్నారు.

# ఏపీలో నియోజకవర్గాలకు ర్యాంకులు.. ఎమ్మెల్యేల పనితీరుకు మార్కులు..

ఏపీలో ప్రభుత్వ పాలనను పరుగులు పెట్టించేందుకు సీఎం చంద్రబాబు నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల పనితీరుపై సర్వే నిర్వహించి, వాటికి ర్యాంకులు, గ్రేడులు కేటాయించారు. ఎమ్మెల్యేల పనితీరు, ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సంతృప్తి వంటి అంశాల ఆధారంగా చేపట్టిన ఈ సర్వేలో 93 శాతం మార్కులతో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ నియోజకవర్గానికి బీజేపీ నేత సుజనా చౌదరి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ఈ ర్యాంకుల్లో 92 శాతం మార్కులతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్న గాజువాక నియోజకవర్గం రెండో స్థానాన్ని దక్కించుకుంది. కాకినాడ అసెంబ్లీ నియోజకవర్గం, విజయవాడ తూర్పు నియోజకవర్గాలు వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వ పథకాల అమలు, శాసనసభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండటం, ఫైళ్ల పరిష్కారం వంటి పలు కీలక అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ సర్వే నిర్వహించారు.

రాష్ట్రంలోని మొత్తం 175 నియోజకవర్గాలను ఏ+, ఏ, దీ గ్రేడులుగా విభజించారు. వీటిలో 21 నియోజకవర్గాలు ఏ+ గ్రేడులో, 153 నియోజకవర్గాలు ఏ గ్రేడులో ఉండగా, కేవలం ఒక్క నియోజకవర్గం మాత్రమే దీ గ్రేడులో నిలవడం గమనార్హం. పాలనలో సాంకేతికతకు పెద్దపీట వేస్తున్న చంద్రబాబు, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇటీవలే ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి, వారి పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు సలహాలు ఇస్తూ, వారిని ప్రోత్సహిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోనే

అత్యధిక మెజారిటీ సాధించిన పల్లా శ్రీనివాసరావు, తాజాగా ఆయన నియోజకవర్గం పనితీరులోనూ రెండో స్థానంలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. పనితీరును మరింత మెరుగుపరచుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఈ సందర్భంగా చంద్రబాబు ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు.

# అమెరికాతో ఉద్రిక్తతలు..

అమెరికాతో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఇరాన్‌లో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ 37 ఏళ్లుగా పాటిస్తున్న ఒక కీలక సంప్రదాయాన్ని తొలిసారిగా పక్కనపెట్టారు. ప్రతి ఏటా ఫిబ్రవరి 8న జరిగే వైమానిక దళ కమాండర్ల సమావేశానికి ఆయన గైర్హాజరయ్యారు. 1989లో నాయకత్వ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి ఖమేనీ ప్రతి సంవత్సరం ఈ సమావేశానికి హాజరవుతూ వస్తున్నారు. ఇరాన్ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో కూడా ఆయన ఈ సమావేశాన్ని నిర్వహించారు. 1979 ఫిబ్రవరి 8న ఇరాన్ ఎయిర్‌ఫోర్స్ అధికారులు పహ్లావి రాజవంశాన్ని కూలదోసి, ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యవస్థాపకుడు అయతొల్లా రుహొల్లా ఖమేనీకి మద్దతు ప్రకటించారు. ఆ చారిత్రక ఘటనకు గుర్తుగా ఏటా ఈ తేదీన వైమానిక దళ ఉన్నతాధికారులు సుప్రీం లీడర్‌తో భేటీ అవుతారు. ఈ ఏడాది ఖొమేనీకి బదులుగా ఆర్మీ చీఫ్ అబ్దొల్‌రహీం మౌసవి కమాండర్లతో సమావేశమయ్యారు.

**అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతలు**

ఖమేనీ గైర్హాజరు వెనుక అమెరికాతో పెరుగుతున్న ఉద్రిక్తతలే కారణమని అంతర్జాతీయంగా విశ్లేషణలు వెలువడుతున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తన సైనిక ఉనికిని భారీగా విస్తరిస్తోంది. తమపై అమెరికా దాడి చేస్తే, ఈసారి యుద్ధం మధ్యప్రాచ్యం మొత్తం విస్తరిస్తుందని ఇరాన్ ఇప్పటికే హెచ్చరించింది. గతేడాది జూన్‌లో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య 12 రోజుల పాటు జరిగిన యుద్ధాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు.

ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా తన యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక నౌకను అరేబియా సముద్రానికి పంపింది. డజను ఎఫ్-15 ఫైటర్ జెట్లు, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, ఇతర యుద్ధ విమానాలు జోర్డాన్‌లోని వైమానిక స్థావరానికి చేరుకున్నాయని బీబీసీ తన కథనంలో పేర్కొంది. యూఎస్ఎస్ డెల్బర్ట్ డి బ్లాక్ యుద్ధనౌక సూయజ్ కాలువ ద్వారా ఎర్ర సముద్రంలోకి ప్రవేశించినట్టు శాటిలైట్ చిత్రాలను విశ్లేషించి వెల్లడించింది. గల్ఫ్ ప్రాంతంలో నిఘా కోసం పలు డ్రోన్లు, నిఘా విమానాలు కూడా తిరుగుతున్నట్టు సమాచారం. ఇరాన్ క్షిపణి వ్యవస్థపై చర్చ జరగాలని అమెరికా పట్టుబట్టడం, తాము కేవలం అణు కార్యక్రమంపైనే చర్చిస్తామని ఇరాన్ స్పష్టం చేయడంతో ఇరు దేశాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది.

## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాసానికి
# విపక్షాల ప్లాన్..

- మొదటి పేజి తరువాయి

తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. పార్లమెంట్ సమావేశాల్లో చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు, ఇరుపక్షాల మధ్య అపనమ్మకం ముదరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

గత గురువారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించాల్సి ఉండగా, విపక్షాల తీవ్ర నిరసనల మధ్య సభను స్పీకర్ అర్ధాంతరంగా వాయిదా వేశారు. 'ప్రధానిని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్ష ఎంపీలు ఏదో అనుకోనిది చేయొచ్చని సమాచారం అందింది' అని ఓం బిర్లా చెప్పడం వివాదానికి దారితీసింది. అంతకుముందు కొందరు మహిళా ఎంపీలు ప్లకార్డులతో ప్రధాని సీటు వద్దకు (ఆ సమయంలో ప్రధాని అక్కడ లేరు) వెళ్లారు. స్పీకర్ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ "పూర్తి అబద్ధాలు" అని కొట్టిపారేశారు. "ప్రధాని ఇప్పుడు స్పీకర్ చాటున దాక్కుంటున్నారు... ఆయనకు ధైర్యం లేదు" అని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఈ అవిశ్వాస తీర్మానంలో స్పీకర్‌కు వ్యతిరేకంగా మూడు ప్రధాన అంశాలను ప్రతిపక్షాలు హైలైట్ చేయనున్నాయి. మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణే రాసిన పుస్తకంలోని కొన్ని భాగాలను చదివేందుకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి అనుమతి నిరాకరించడం మొదటిది. అదే సమయంలో కాంగ్రెస్‌ను, గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న పుస్తకాల నుంచి చదివేందుకు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేకు అనుమతి ఇవ్వడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన దూబేపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నిస్తున్నాయి. 2020లో భారత్-చైనా సరిహద్దు వివాదంపై ఉన్న ఆ పుస్తక భాగాలను రికార్డుల్లో చేర్చాలని రాహుల్ పట్టుబట్టారు. తాను ఆ సమాచారానికి బాధ్యత వహిస్తానని లిఖితపూర్వకంగా ఇచ్చినా స్పీకర్ అంగీకరించలేదు. దీంతో సభలో తీవ్ర గందరగోళం చెలరేగింది. ఈ క్రమంలో నిరసన తెలిపిన 8 మంది కాంగ్రెస్ ఎంపీలను సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేశారు. "రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. దీనిపై నిరసన తెలిపితే మమ్మల్ని సస్పెండ్ చేశారు. ఇది అంత పెద్ద నేరమా?" అని సస్పెండైన ఎంపీ అమరీందర్ రాజా వారింగ్ ప్రశ్నించారు. ఈ పరిణామాలతో పార్లమెంట్‌లో రాజకీయ వేడి మరింత పెరిగింది.

# తొలి ఎన్నికల బరిలో విజయ్.. రెండు నియోజకవర్గాల నుంచి పోటీ!

నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రానికి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని విరుగంబాక్కం, మధ్య తమిళనాడులోని తిరుచ్చి తూర్పు స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇది పార్టీ విస్తరణతో పాటు వ్యవస్థాపకుడైన విజయ్‌కు బలమైన ఆరంభం ఇచ్చేందుకు రూపొందించిన వ్యూహమని టీవీకే నేతలు చెబుతున్నారు. చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం పట్టణ ఓటర్లు, మొదటిసారి ఓటు వేయనున్న యువతలో విజయ్‌కు మంచి ప్రచారం కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు తిరుచ్చి తూర్పు నుంచి పోటీ చేయడం ద్వారా పార్టీ కేవలం చెన్నైకే పరిమితం కాదనే సంకేతాన్ని రాష్ట్రవ్యాప్తంగా పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి వెలచ్చేరి, విక్రవాండి, నాగపట్టణం వంటి నియోజకవర్గాలను కూడా పరిశీలించినా, ఓటర్లతో ఉన్న పరిచయం, క్షేత్రస్థాయిలో పార్టీ సన్నద్ధత ఆధారంగా విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలను ఖరారు చేసినట్లు సమాచారం. విజయ్ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తుండటం, అధికార డీఎంకే బలంగా ఉండటంతో గెలుపు అవకాశాలను పెంచుకునేందుకే రెండు చోట్ల పోటీ చేయాలనే జాగ్రత్తతో కూడిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలకు డీఎంకే ఎమ్మెల్యేలు ఏ.ఎం.వి. ప్రభాకర రాజా, ఇనిగో ఎస్. ఇరుదయరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ రెండు చోట్లా పోటీ ఆసక్తికరంగా మారనుంది. త్వరలోనే విజయ్ తన ప్రచార వ్యూహాలను ప్రకటించి, బహిరంగ సభలను ముమ్మరం చేయనున్నారు.

# 'పరీక్షా పే చర్చ'లో దేశ నిర్మాణంపై విద్యార్థులకు మోదీ పాఠాలు

10, 12వ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే 'వికసిత భారత్' నిర్మాణం గురించి ఆలోచిస్తుండటం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. కేవలం పరీక్షలకే పరిమితం కాకుండా దేశ భవిష్యత్తు లక్ష్యాలపై యువత దృష్టి సారించడం గొప్ప విషయమని ఆయన అన్నారు. ఇవాళ 'పరీక్షా పే చర్చ 2026' రెండో ఎపిసోడ్‌లో భాగంగా ఆయన దేశవ్యాప్తంగా విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడులోని కోయంబత్తూరుతో పాటు పలు ప్రాంతాల విద్యార్థులతో ప్రధాని సంభాషించారు. 2047 నాటికి దేశాభివృద్ధికి దోహదపడాలనే విద్యార్థుల ఆసక్తిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అభివృద్ధి చెందిన దేశాల పౌరులలో ఉండే క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. "ఇంట్లో భోజనం చేసేటప్పుడు ప్లేటులో ఒక్క మెతుకు కూడా వృథా చేయకుండా తినడం అలవాటు చేసుకోండి. ఇలా దేశంలోని ప్రతి ఒక్కరూ చేస్తే ఎంత ఆహారం ఆదా అవుతుందో ఊహించండి. ఇలాంటి చిన్న పనులే బలమైన, బాధ్యతాయుతమైన భారత నిర్మాణానికి పునాదులు వేస్తాయి" అని మోదీ విద్యార్థులకు వివరించారు.

అలాగే ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్ లైట్ పడినప్పుడు ఆగడం వంటి చిన్న విషయాలు కూడా వ్యక్తిగత క్రమశిక్షణకు నిదర్శనమని ప్రధాని తెలిపారు. స్ఫూర్తి, ప్రేరణ వంటివి విజయానికి కేవలం అదనపు హంగులు మాత్రమేనని, కానీ క్రమశిక్షణే దానికి అసలైన పునాది అని ఆయన స్పష్టం చేశారు. తొమ్మిదో విడతగా జరుగుతున్న ఈ కార్యక్రమానికి 4.5 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు రావడం విశేషం. పరీక్షల ఒత్తిడిని తగ్గించడంతో పాటు దేశ ప్రగతిలో తమ పాత్ర గురించి విద్యార్థులను ఆలోచింపజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

# అంబటి రాంబాబుకు బెయిల్ మంజూరు..అయినా జైలుకే!

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఒక కేసులో ఊరట లభించినా, ఆయన జైలు నుంచి ఇప్పట్లో విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో గుంటూరు స్పెషల్ మొబైల్ కోర్టు ఇవాళ ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయన జైలు నుంచి బయటకు వస్తారని అంతా భావించారు. అయితే, ఆయన బెయిల్‌పై విడుదలవుతున్న సమయంలోనే పట్టాభిపురం పోలీసులు మరో కేసులో రంగప్రవేశం చేశారు. గతంలో పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై నమోదైన కేసులో పీటీ వారెంట్‌పై అంబటిని స్పెషల్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, ఆయనకు 14 రోజుల పాటు అంటే ఈ నెల 22 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. సీఎంపై వ్యాఖ్యల కేసులో ఈ నెల 1న అరెస్టయిన అంబటి, అప్పటి నుంచి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్న విషయం తెలిసిందే. తాజాగా ఒక కేసులో బెయిల్ వచ్చినా, మరో కేసులో రిమాండ్ పడటంతో పోలీసులు ఆయన్ను తిరిగి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. కాగా, అంబటి రాంబాబుపై రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 కేసులు నమోదైనట్లు సమాచారం.

# ఎంఐఎం మద్దతు లేకుండా కాంగ్రెస్ గెలిచిందా?

- మొదటి పేజి తరువాయి

అని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం సత్తా ఏమిటో చూపుతామని అన్నారు. మరోవైపు అసోం సీఎం హిమంత బిశ్వపై హైదరాబాద్ పోలీసులకు ఒవైసీ ఫిర్యాదు చేశారు. ముస్లింలను కాల్చుతున్నట్టుగా ఉన్న వీడియోను పోస్టు చేసినందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని ఒవైసీ అన్నారు. ముస్లింలను రెచ్చగొట్టేందుకు దురుద్దేశపూర్వకంగా ఈ వీడియోను హిమంత పోస్టు చేశారని మండిపడ్డారు. జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించేలా ఆయన తీరు ఉందని విమర్శించారు.

## పంజాబ్ సీఎం విదేశీ పర్యటనకు
# అనుమతినివ్వని కేంద్రం

- మొదటి పేజి తరువాయి

పర్యటన అర్ధాంతరంగా రద్దయింది. ఇటీవల మాన్ విదేశీ పర్యటనలకు అనుమతి నిరాకరించడం ఇది వరుసగా మూడోసారి కావడం గమనార్హం. పంజాబ్ ప్రభుత్వం వచ్చే నెలలో నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్టర్స్ సమ్మిట్' కోసం పెట్టుబడులను ఆహ్వానించడానికి భగవంత్ మాన్ చెక్ రిపబ్లిక్ మరియు నెదర్లాండ్స్‌లో పర్యటించాల్సి ఉంది. పారిశ్రామికాభివృద్ధి, విద్య, మరియు విదేశీ పంజాబీల సహకారం కోసమే ఈ పర్యటన ఖరారైంది. అయితే కేంద్రం నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు బ్రేక్ పడింది.

**వివాదాస్పదంగా 'పొలిటికల్ క్లియరెన్స్'**

రాష్ట్రాల ముఖ్యమంత్రులు విదేశాల్లో పర్యటించేందుకు విదేశాంగ శాఖ అనుమతి తీసుకోవడం తప్పనిసరి. దీనినే పొలిటికల్ క్లియరెన్స్ గా వ్యవహరిస్తారు. అయితే, ఈ నిబంధన చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. పంజాబ్ విషయానికి వస్తే.. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పర్యటనలపై కేంద్రం వరుసగా ఆంక్షలు విధిస్తోంది. పొలిటికల్ క్లియరెన్స్ నిరాకరిస్తోంది. ఈ ఏడాది జనవరిలో యూకే మరియు ఇజ్రాయెల్ లో పర్యటించేందుకు మాన్ అనుమతి కోరగా నిరాకరించింది. గతంలో పారిస్ ఒలింపిక్స్ సందర్శనకూ ఇలాగే అడ్డుచెప్పడంతో ఆ పర్యటన రద్దయింది. తాజాగా చెక్ రిపబ్లిక్, నెదర్లాండ్స్ పర్యటనకూ మాన్ కు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. అయితే, ఈ అనుమతిని నిరాకరించడానికి గల కారణాలను విదేశాంగ శాఖ బహిరంగంగా వెల్లడించలేదు. ఈ వ్యవహారం ఇప్పుడు కేంద్ర-రాష్ట్ర సంబంధాల మధ్య మరోసారి చిచ్చు రేపింది.

**కేంద్రంపై 'ఆప్' విమర్శ**

కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తీవ్రంగా ఖండించింది. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల అభివృద్ధిని కేంద్రం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని ఆప్ నేతలు మండిపడుతున్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్తున్నప్పుడు పంజాబ్ సీఎంకు మాత్రమే అనుమతి ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నిస్తున్నారు.

## పట్టిసం నిధిపై భక్తులకు అసౌకర్యం కలుగకుండా తగు ఏర్పాట్లు- ఎండోమెంట్ ఈఓ లక్ష్మి



**పోలవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9:**ఏలూరు జిల్లాలోని పట్టిసీమ నిధిపై వెలసిన శ్రీ వీరేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 15వ తారీఖున మహాశివరాత్రి సందర్భంగా శివరాత్రి ఉత్సవాలు దేవాలయ ఈఓ లక్ష్మీ ఆధ్వర్యంలో జరగనున్నాయి. ఈ నేపధ్యంలో ఈ ఉత్సవాలను పలు శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ అత్యంత ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ముందుగా అందరికి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలియజేశారు. తిరునాళ్లకు వచ్చిన భక్తులకు చలువ పందిళ్లు, త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులు అందరూ స్వామి వారిని దర్శించుకుని, క్షేమంగా తమ ఇండ్లకు చేరుకోవాలని ఈఓ ఆకాంక్షించారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి





# దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల అస్వస్థత

### అల్పాహారం అనంతరం వాంతులు, విరోచనాలు అప్రమత్తమైన అధికారులు

### ఆకస్మిక తనిఖీ చేసిన గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్

### ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

**గంగవరం /మారేడుమిల్లి/రంపచోడవరం, ఫిబ్రవరి 9 :**మారేడుమిల్లి మండలం దేవరపల్లి గిరిజన సంక్షేమ శాఖ బాలురు ఆశ్రమ పాఠశాలలో అల్పాహారం, భోజనం అనంతరం పలువురు విద్యార్థులు వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో అస్వస్థతకు గురికావడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. బాధిత విద్యార్థులను వెంటనే రంపచోడవరం ఏరియా ఆసుపత్రి, మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి ప్రత్యేక వైద్యసేవలు అందించారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డైరెక్టర్ వి. ప్రసన్న వెంకటేష్ వెల్లడించారు.సంఘటనపై స్పందించిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ వి. ప్రసన్న వెంకటేష్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మరియు పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ సోమవారం ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి సమగ్ర తనిఖీ చేపట్టారు. ముందుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు.తరువాత ఆశ్రమ పాఠశాలలో డార్మిటరీలకు వెళ్లి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎవరికైనా ఇంకా వాంతులు, విరోచనాలు, కడుపునొప్పి లక్షణాలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు ఎటువంటి భయాందోళనలకు గురికావద్దని భరోసా ఇచ్చారు.

### ఆహార నాణ్యతపై సమగ్ర తనిఖీ

వంటశాల, స్టోర్ రూమ్‌లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. సంఘటన జరిగిన రోజున తయారుచేసిన ఇడ్లీ, బొంబాయి చట్నీ తయారీ విధానం, వాడిన పదార్థాల నాణ్యత, నిల్వ విధానాలపై ఆరా తీశారు. కాలపరిమితి ముగిసిన నిత్యవసర సరుకులు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించారు.కూరగాయలు, పాలు, గుడ్లు తదితర సరుకులను సరఫరా చేసే వెండర్ల విధానం, సరఫరా వ్యవస్థపై కూడా వివరాలు సేకరించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ కచ్చితంగా అమలు చేయాలని, ప్రతిరోజూ తాజా ఆహారం మాత్రమే అందించాలని ఆదేశించారు.విద్యార్థులకు కాచి చల్లార్చిన తాగునీరు అందజేయాలని, చేతులు కడుక్కోవడానికి ఏర్పాటు చేసిన ట్యాపుల వద్ద అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్ల పనితీరు, తాగునీటి సరఫరా విధానాన్ని సమీక్షించారు.

### మౌలిక వసతులపై హామీ

ఈ సందర్భంగా కొంతమంది తల్లిదండ్రులు మరుగుదొడ్ల మరమ్మతులు, రన్నింగ్ వాటర్ సౌకర్యం, పాఠశాల వెనుక భాగంలో ప్రహరీ గోడ నిర్మాణం అవసరాన్ని డైరెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన డైరెక్టర్ సంబంధిత పనులు తక్షణమే చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మెనూ అమలు పట్టికను స్పష్టంగా ప్రదర్శించాలని ఆదేశించారు.అనంతరం డైరెక్టర్, జాయింట్ కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రతి విద్యార్థి పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డిఎంఅండ్ హెచ్ఓ డా. పి. సరిత, మాజీ ఎమ్మెల్యే యన్. ధనలక్ష్మి, ఎంపీపీ ఎస్. లలిత, వైస్ ఎంపీపీ రవికుమార్, సర్పంచ్ లోత రామారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ. శ్రీనివాసరావు, సిడిపిఓ శాంతికుమారి, డిఈ చైతన్య, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి జె. శంభుడు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రకాశరావు, వైద్యాధికారులు రాజశేఖర్, క్రాంతి, సాంబశివరావు, పి.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.







## జీఎస్డీపీ వృద్ధి, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు మరింత వేగం పెంచాలి

### జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో నిర్వహిస్తున్న "మంత్రులుకార్యదర్శుల కాన్ఫరెన్స్"లో భాగంగా 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీఎస్డీపీ వృద్ధి, జిల్లా వారీ పనితీరు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ డి నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, ఆర్ ఎమ్ సి కమిషనర్ రాహుల్ మీనా , డి ఆర్వో టి సీతారామ మూర్తి, ఇతర అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ఇతర క్షేత్ర స్థాయి అధికారులు ఆయా ప్రాంతాల నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు సూచనలు చేస్తూ, తూర్పు గోదావరి జిల్లా రాష్ట్ర జీఎస్డీపీకి సుమారు 4 శాతం వాటా కలిగి 12వ ర్యాంక్‌ను నిలబెట్టు కోవడం అభినందనీయమని, మెరుగైన స్థానం కోసం సమిష్టి కృషి అవసరం అని తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరంలో జిల్లా జీడీడీపీ రూ.70,512 కోట్లకు చేరుకుని 10.24 శాతం వృద్ధిని నమోదు చేయడం వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల సమిష్టి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.

రాష్ట్రంలో టాప్10 జిల్లాల సరసన తూర్పు గోదావరి జిల్లా నిలవాలంటే పరిశ్రమల విస్తరణ, పెట్టుబడుల ఆకర్షణ, సేవారంగ అభివృద్ధిపై మరింత దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. మౌలిక వసతుల మెరుగుదల, ఉపాధి అవకాశాల సృష్టి, సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాల అమలుతో జిల్లాను ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలని అధికారులను కోరారు.

అగ్రి , అలైడ్ సెక్టార్‌లో జిల్లాకు 81 స్కోర్‌తో 'ఏ' గ్రేడ్ రావడం సానుకూలమని, రాష్ట్ర సగటు 91 స్కోర్ (ఏ+) స్థాయికి చేరుకునే స్పష్టమైన అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా 18వ స్థానంలో ఉన్నప్పటికీ, కీలకమైన 10 సూచికలలో ఇంకా మెరుగుదల సాధించవచ్చని తెలిపారు. ఉత్పత్తి విలువ పెంపు, అనుబంధ రంగాల సమన్వయం, రైతు ఆధారిత సేవల వేగవంతంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక, సామాజిక, మౌలిక వసతులు, పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, పరిపాలనా సంస్కరణలు, శాంతి భద్రతలు వంటి అంశాలపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి. 202627 సంవత్సరానికి కేంద్ర ప్రాయోజిత పథకాల కార్యాచరణ, ఆదాయార్జన శాఖల పనితీరు, పీపీపీ ప్రాజెక్టులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, రియల్ టైమ్ గవర్నెన్స్‌లో ఏఐ, డేటా లేక్, అవేర్ వంటి సాంకేతిక సాధనాల వినియోగంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు

## రూపాయి నాణేలతో రూపుదిద్దుకున్న శివలింగం.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 9.** పురాణాల్లో భక్తులు తమ భక్తిని వివిధ రూపాల్లో ప్రదర్శించి భగవంతుడి కృపకు పాత్రుడైన సంఘటన ఎన్నోవిన్నాము. తన ఇష్ట దైవాన్ని దర్శించుకుని తమ వద్ద ఉన్న కళలతో వారిని మెప్పించి సాక్షాత్తు భగవంతుని మెప్పు పొందిన భక్తులు కొందరు ఉన్నారు. వీరంతా తమ భక్తిని చాటుతూ భగవంతునికి దగ్గరయ్యారనే చెప్పాలి. ముఖ్యంగా శివలింగాల విషయానికొస్తే ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన రూపంలో శివలింగాన్ని తయారుచేసి అర్చనలు చేయడం ఆనవాయితీగా మారింది. ఇదే తరహాలో మండలంలోని కొవ్వూరు పాడు గ్రామానికి చెందిన శివ భక్తుడు చిలక సాయి తేజ రూపాయి నాణెములతో మహా శివలింగాన్ని తయారుచేసి తన భక్తిని చాటుకున్నాడు. తాను కూడా పెట్టిన లక్ష 25 వేల రూపాయల నాణేల తో శివలింగాన్ని తయారు చేశాడు. ఈ మహా శివలింగాన్ని ఈనెల 15వ తేదీన జరగనున్న శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా పట్టి సీమ వద్ద ప్రతిష్టించిన జరుగుతుందని సాయి తేజ తెలిపారు. తనకు శివయ్య అంటే ప్రాణమని తాను ఆయన పరమ భక్తుండని అని చెప్పారు. దీని మీద ఉన్న విశ్వాసం, ప్రేమ కారణంగా వినూత్న రీతిలో శివలింగాన్ని తయారు చేయాలని ఆలోచన వచ్చింది అన్నారు. రూపాయి నాణాలను సుదీర్ఘకాలంగా కూడబెట్టి వాటితో శివలింగాన్ని తయారుచేసి తన భక్తిని చాటుకున్నానన్నారు. ఎంతో పరమ పవిత్రమైన ఈ శివలింగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, నియమ నిష్ఠలతో రూపొందించడం జరిగిందని తెలిపారు. అయితే అత్యంత శోభా మానంగా ఉన్న ఈ మహాలింగాన్ని తిలకించిన వారు ముక్కు మీద వేలు వేసుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు మనతో తిరిగే సాయి తేజ దగ్గర ఇంత గొప్ప కళ ఉందా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఆ శివలింగానికి నమస్కరించి తమ భక్తిని చాటుకుంటున్నారు. ఏది ఏమైనా ఇటువంటి ఆలోచన వచ్చి అరుదైన శివలింగాన్ని తయారుచేసిన సాయి తేజ భక్తికి అందరూ మెచ్చవలసిందే.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి



## అంగన్ వాడీ భవనాల నిర్మాణాలు ప్రారంభించి రెండేళ్లు..

- పూర్తయ్యేందుకు ఎన్నేళ్లు?
- అర్బన్ ప్రాజెక్టు సెక్టార్-1లో నిలిచిన నిర్మాణాలు

**ఏలూరు పిబ్రవరి 9 పెన్ పవర్ :** ఏలూరు రూరల్ మండలం చాటపర్రు సెక్టార్ పరిధిలోని గత ప్రభుత్వ హయాలంలో నాడు నేడు పథకంలో భాగంగా శ్రీపర్రు, మొండికోడు, కలకుర్రు, గుడివాక లంక గ్రామాలకు 5 అంగన్ వాడి నూతన భవనాలు పంచాయితీల పరిధిలో మంజూరు చేశారు రెండేళ్ల క్రితం వీటి నిర్మాణపు పనులు ప్రారంభించారు.ఒక్క మొండికోడు అంగన్ శాడీ కేంద్రం మినహా శ్రీపర్రు అంగన్‌వాడీ భవనం స్లాబ్ దశలోను,మిగిలినవి లింటల్ దశలోనూ నిధుల లేవమితో నిర్మాణపు దశలో నిలిచిపోయాయి.భవనాల నిర్మాణాలకు సంభందించి ఇప్పటికే కిటికీలు,గుమ్మాలు, తదిత సామగ్రి అంగన్ వాడీ కేంద్రాలకు పంపగా, వాటిని అంగన్ వాడీ సిబ్బంది అద్దెభవనాల్లో ఉంచారు. భవనాల నిర్మాణాలు పూర్తి కాక పోవడంతో చిన్నారులు,అంగన్‌వాడీ సిబ్బంది నూతన భవనం లేక అద్దె ఇళ్లలో చాలీ చలని ఇరుకు గదుల్లో అవస్థలు పడుతున్నారు.
ఈ విషయమై సూపర్‌వైజర్ సత్యను వివరణ కోరగా నిధుల లేమితో నిర్మాణాలు నిలిచాయని,ఉన్నతాధికారులకు సిడిపిఓ నివేదిక పంపించారని, నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం పూర్తి చేస్తామని తెలిపారు.

# బాలికల హక్కులు, భద్రతపై అవగాహన

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9**
బాలికలు క్రమశిక్షణతో చదువుకుని, ఉన్నత స్థాయికి చేరుకొని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి సూచించారు. తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి ఎన్. శ్రీలక్ష్మి ప్రభుత్వ బాలికల సదనాన్ని సందర్శించి బాలికలకు అందుతున్న వసతులు, సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా వసతి గృహంలో బాలికలతో మాట్లాడి వారి విద్య, ఆరోగ్యం, భద్రత, భోజనం, దైనందిన అవసరాలు తదితర అంశాలపై వివరాలను ఎన్ శ్రీలక్ష్మి అడిగి తెలుసు కున్నారు. బాలికలకు కల్పిస్తున్న వసతి, విద్యా వాతావరణం సంతృప్తికరంగా ఉందని తెలిపారు. శ్రీలక్ష్మి బాలికలకు మంచి స్పర్శ చెడు స్పర్శలపై అవగాహన కల్పిస్తూ, తమపై జరిగే అన్యాయాలు, వేధింపులలో భయపడకుండా వెంటనే తెలియజేయాలని సూచించారు. బాలికల హక్కుల పరిరక్షణకు సంబంధించిన చట్టాలు, ముఖ్యంగా బాలల సంరక్షణ చట్టం బాలల హక్కుల చట్టం, ఉచిత న్యాయ సహాయం వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. వసతి గృహంలో గానీ, బయట గానీ సమస్యలు ఎదురైనా, న్యాయ



సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను లేదా హెల్ప్‌లైన్ నెంబర్ 15100 ను సంప్రదించాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బాలికల హక్కుల పరిరక్షణకు అందుబాటులో ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 18 అర్జీల స్వీకరణ

**చట్టపరిధిలో శాశ్వత పరిష్కారం ఇస్తామని హామీ**







**భీమవరం / పశ్చిమగోదావరి, పెన్ పవర్ ఫిబ్రవరి 9 :**ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కరించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)" కార్యక్రమంలో భాగంగా సోమవారం భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.
జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల ఫిర్యాదులను అదనపు ఎస్పీ స్వయంగా స్వీకరించి వారి సమస్యలను విన్నారు. ప్రతి అర్జీపై సానుకూలంగా స్పందించి, పూర్తిస్థాయి విచారణ జరిపి చట్టపరిధిలో శాశ్వత పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు.
సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి అర్జీదారుల సమస్యలను నిర్ణీత గడువులోగా విచారించి పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీస్ శాఖ నిలవాలని స్పష్టం చేశారు. అర్జీలు మళ్లీ పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారణ జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.
ఈరోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త లేదా అత్తారింటి వేధింపులు, భూఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీల సమస్యలు, ఆన్లైన్ మోసాలు, ప్రేమ పేరుతో మోసం, ఆస్తి తగాదాలు తదితర అంశాలపై మొత్తం 18 అర్జీలను స్వీకరించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె.వి.వి.ఎన్. సత్యనారాయణతో పాటు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్ ఫిబ్రవరి 09.** 10.02.2026 మంగళవారం నాడు 33/11 కేవి విద్యుత్ సబ్ స్టేషన్ హౌసింగ్ బోర్డు కాలనీ లో రైల్వే ఫీడర్ మరియు కొండయ్యచెరువు సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎల్ ఐ సి ఫీడర్ కు సంబంధించి రైల్వే స్టేషన్ రోడ్, వెంకటరత్నం ఆస్పటల్ ఏరియా, టెలిఫోన్ ఎక్స్ఛేంజి రోడ్, రామారావు పేట, పోస్ట్ ఆఫీస్ రోడ్డు, ఎల్ఐసి ఆఫీస్ రోడ్డు, శంకర్రావు హాస్పిటల్ ఏరియాలకు లైన్ ల మరమ్మత్తుల నిమిత్తం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును.
పట్టణ వినియోగదారులు సహకరించాల్సింధిగా కోరుచున్నాము. తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/ఏపీ ఇపి డిసెల్ కె. నరసింహామూర్తి ఒక ప్రకటన తెలిపారు.

## ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుబకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

- తూర్పుగోదావరి జిల్లాలో రూ . 250 కోట్లు చెల్లించకపోతే ఆత్మహత్య లే గతి
- పట్టించుకోని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్
- ఫీజు బకాయిలు చెల్లించాలని
- ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాల, నిర్వాహకుల సంఘం ఆధ్వర్యంలో టికే రిలే దీక్ష




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9 :**గత ప్రభుత్వంలోనూ, నేటి కూటమి ప్రభుత్వం లోను పెండింగ్ లో ఉన్న ప్రైవేటు విద్యాసంస్థల ఫీజు బకాయలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాల, నిర్వాహకుల సంఘం నాయకులు, రాజమహేంద్రి విద్యాసంస్థల విద్యా సంస్థల అధినేత డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు.
ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ తో సోమవారం స్థానిక గోకవరం బస్టాండు గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అయన మీడియాతో మాట్లాడుతూ, గత జగన్ ప్రభుత్వంలో మూడు దపాలుగా పెండింగ్ పెట్టిందని, అధికారం దిగిపోయే నాటికి కూడా చెల్లించలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక 8 దపాలకు రెండు దపాల ఫీజు బకాయిలు చెల్లించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం కింద రెండున్నర సంవత్సరాల నుంచి రూ.6500 కోట్ల రూపాయలు, తూర్పుగోదావరి జిల్లాలో రూ. 250 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని ఆయన ఆవేదన చెందారు. రాష్ట్రంలో 1138 ప్రైవేటు విద్యాసంస్థలు ఉండగా, తూర్పుగోదావరి జిల్లాలో 234 ప్రైవేట్ విద్యా సంస్థలకు బకాయిలు చెల్లించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో విద్యాసంస్థలను నిర్వహించలేకపోతున్నామని, సిబ్బందికి జీతభత్యాలు కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొందని, అప్పులు చేసి విద్యాసంస్థలు నడుపుతున్నామని అన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారని బకాయలు ఉండడంతో సంబందిత విశ్వవిద్యాలయాలు ఉత్తీర్ణత సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తు న్నాయన్నారు . దాంతో వారు ఉన్నత చదువులు గాని, ఉద్యోగ, ఉపాధి ప్రయత్నాలకు ఆటంకం కలుగుతుందని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ మాట్లాడితే వేల కోట్ల పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగాల కల్పన
క్షేత్రస్థాయిలో విద్యాసంస్థల , విద్యార్థుల మౌలిక సమస్యలను పట్టించుకో వడంలేదని విమర్శించారు. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఉన్నత అధికారుల, మంత్రుల దృష్టికి బకాయిల సమస్యను తీసుకెళ్లినప్పటికీ ఇంతవరకు స్పందన లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం బకాయిల్ని వెంటనే చెల్లించకపోతే విద్యాసంస్థల యాజమాన్యాలకు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోతే తాము ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమని ఆయన హెచ్చరించారు.

## మునిసిపల్ కార్యాలయంలో 2025-2026 స్వచ్ఛ సర్వేక్షణ అవార్డు గురించి సమావేశం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 09,** 2025-2026 స్వచ్ఛ సర్వేక్షణ అవార్డు గురించి సమావేశం నిర్వహించారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కమిషనర్ సార్ 2025-2026 సంవత్సరానికి స్వచ్ఛ సర్వేక్షణ అవార్డు సాధించడానికి అవసరమైన చర్యల గురించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పురపాలక సంఘ అధికారులు మరియు కార్మికులు పాల్గొన్నారు.
సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛ సర్వేక్షణ అవార్డు సాధించడానికి పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచడం, వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం మరియు ప్రజలలో స్వచ్ఛతా అవగాహన పెంచడం అవసరమని తెలిపారు. అలాగే అధికారులకు మరియు కార్మికులకు లక్ష్యాలను నిర్దేశించి, పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎన్విరాన్మెంట్ ఏఈ , ఎఫ్1 , సిసిఎం శానిటేషన్ సెక్రటరీ లు పాల్గొన్నారు.

## పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ లో 19 ఫిర్యాదులు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం కార్యక్రమాన్నీ తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు సోమవారం నిర్వహించడం జరిగింది. జిల్లా ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి వారి , బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని, వెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చారు.
నేటి పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం" కార్యక్రమానికి 19 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట, ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు.

## ప్రజలు బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తనపై అవగాహన కలిగి వుండాలి

**కలెక్టర్ కీర్తి చేకూరి**




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9 :**ప్రజల్లో బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తనను పెంపొందించడమే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు.
భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం సందర్భంగా, ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.
శుక్రవారం కలెక్టరేట్ లో పోస్టర్లను ఎస్పీ, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లతో కలిసి కలెక్టర్ కీర్తి చేకూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ , సురక్షిత బ్యాంకింగ్ విధానాలు, డిజిటల్ లావాదేవీలలో జాగ్రత్తలు, పొదుపు అలవాట్లు, ఆర్థిక మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం లో బ్యాంకింగ్ సేవలు, బీమా, పెన్షన్ పథకాలు, డిజిటల్ లావాదేవీల భద్రత వంటి అంశాలపై అవగాహన నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాధ్యతాయుత ఆర్థిక ప్రవర్తనపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని వివరించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మేఘ స్వరూప్, జిల్లా ఎస్పీ డి. నరసింహ కిశోర్, ఆర్ఎంసీ కమిషనర్ రాహుల్ మీనా, డీఆర్ఓ టి..సీతారాం మూర్తి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బలుసులమ్మ జాతరకు రూ. 5 లక్షలు విరాళం అందజేసిన వాసవి యాజమాన్యం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 09:** శ్రీశ్రీశ్రీ బలుసులమ్మవారి జాతరకు పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.5 లక్షల భారీ విరాళం అందజేశారు.కళాశాల అధ్యక్షులు గ్రంధి సత్యనారాయణ బృందం
స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ను ఆయన కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యే సమక్షంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ రంగం అంజిబాబుకు ఈ విరాళం సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014లో జాతర నిర్వహించామని, అమ్మవారి దయతో మళ్ళీ ఇప్పుడు జాతర నిర్వహించే అవకాశం వచ్చిందని అన్నారు. బలుసులమ్మ ఆశీస్సులతో తాడేపల్లిగూడెం ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో వర్ధిల్లాలనే సత్సంకల్పంతో ఈ జాతర మహోత్సవం నిర్వహిస్తున్నామని అన్నారు.ప్రజలందరూ ఈ పుణ్య కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వాసవి ఇంజినీరింగ్ కాలేజ్ యాజమాన్యం, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## హెల్మెట్ల పై అవగాహన



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఫిబ్రవరి 9;** ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని ఎస్సై వి క్రాంతి కుమార్ సూచించారు. సోమవారం జీలుగుమిల్లిలో జాతీయ రహదారిపై హెల్మెట్ల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రహదారిపై వెళ్లేటప్పుడు హెల్మెట్లు మీ ప్రాణాలను కాపాడే ప్రధాన రక్షణ కవచమని అన్నారు. సుమారు 50 మంది వాహనదారులకు అక్కడికక్కడే హెల్మెట్లు కొనుగోలు చేయించి ,ధరింప చేశారు .హెల్మెట్ లేకుండా రోడ్డుపైకి రావద్దని వాహనదారులకు హెచ్చరిక జారీ చేశారు. ప్రతిరోజు హెల్మెట్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని అన్నారు. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

# అంజుమన్ -ఏ -ఇస్లామీయ సంస్థ ఆస్తులను ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ వినతి పత్రం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9 :**అంజుమన్ -ఏ -ఇస్లామీయ సంస్థకు చెందిన ఆస్తులను ప్రైవేటీకరణ చేయుటకు సిద్ధమైన కూటమి ప్రభుత్వ నిర్ణయాన్నీ నిరసిస్తూ కలెక్టరేట్ లో ఏ ఓ కు సోమవారం జిల్లా వైయస్సార్సీపి మైనార్టీ సెల్ నాయకులు ,కార్యకర్తలు మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు యండి హమీద్ బాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హసీనా, రాష్ట్ర అధికార ప్రతినిధి అలీ, రాష్ట్ర మాజీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ నిజామ్, వక్ఫ్ బోర్డ్ మాజీ అధ్యక్షులు ఆరిఫ్, రాష్ట్ర కార్యదర్శి అమానుల్లా బేగ్, వక్ఫ్ బోర్డు మాజీ చెర్మన్ కరీం ఖాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం భాషా, జిల్లా కార్యదర్శి మస్తాన్ బేగ్, మౌలాలి మీరావలి, రూరల్ మైనార్టీ సెల్ ఇంచార్జ్ చానా, రాజమహేంద్రవరం నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆరిఫుల్లాఖాన్, నిడదవోలు నియోజకవర్గ మైనార్టీ సెల్ ఇంచార్జ్ చాంద్ బాషా, రాజానగరం మైనారిటీ సెల్ ఇంచార్జ్ కాలా భాషా, గోపాలపురం ఇంచార్జ్ యూసఫ్ ముస్తఫా, మాజీ సంచార జాతుల డైరెక్టర్ షకీలా బేగం, మహిళ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకురాలు సమీరా బేగం నాయకులు అల్తాఫ్ మదీనా భాషా, అప్సర్ బేగ్, ఇబ్రహీం షరీఫ్, జిలాని, మ్యాజిక్ భాషా తదితరులు పాల్గొన్నారు.

# తాడేపల్లిగూడెం ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కార్యవర్గం, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ని మర్యాదపూర్వక కలయిక.......



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 09.** స్థానిక సిపాయి పేట లో గల తాడేపల్లిగూడెం ప్రాంతీయ తాపీ వడ్రంగి సెంట్రింగ్ రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్, 2026– 28 నూతన కార్యవర్గం ఏర్పడిన సందర్భంగా, శాసనసభ్యులు శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ ని, అధ్యక్షులు పడాల శ్రీనివాసు ఆధ్వర్యంలో, నూతన కార్యవర్గ సభ్యులంతా మర్యాదపూర్వకంగా కలిసారు...

యూనియన్ అధ్యక్షులు పడాల శ్రీనివాసు మాట్లాడుతూ, తాడేపల్లిగూడెం ఏరియాలో సుమారు 5000 మంది కార్మికులు సభ్యులుగా ఉన్న మా సంఘానికి, సరియైన భవనము లేక ఇబ్బందులు పడుతున్నాం, సంఘం భవనానికి తగిన స్థలాన్ని ఇప్పించి సహకరించవలసిందని కోరారు,శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడడంలో, ప్రధాన భూమిక, భవన నిర్మాణ కార్మికులదే నని, వారికి ఏ విధమైనటువంటి సహాయ సహకారాలు కావాలన్నా, జనసేన పార్టీ మరియు కూటమి ప్రభుత్వం పూర్తి అండదండలు అందిస్తుందని, సంఘం భవనానికి అవసరమగు స్థలాన్ని, ఇప్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గ గౌరవాధ్యక్షులు శ్రీ అంకం భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామకృష్ణ, కోశాధికారి మాధు శ్రీను, ఆర్గనైజింగ్ కార్యదర్శి కోడే సాయి బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, యూనియన్ పెద్దలు. పాలూరి లక్ష్మణరావు, నాగేశ్వరరావు, రాజా వెంకటరావు, మెండెం జేమ్స్, కృష్ణ, రెడ్డి శ్రీనివాస్, కామిరెడ్డి సత్యనారాయణ, దేవా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు రౌతు శ్రీనివాసరావు, తోట సత్యనారాయణ, రెడ్డి మురళీకృష్ణ, దూలం ఆనంద్, పెరికల శివరామకృష్ణ, కాకర్ల రాంబాబు, సనమండ్ర విజయ్, అల్లిమెల్లి నాగభూషణం, అచ్యుత దుర్గాప్రసాద్, ఉప్పులూరి మధు, మల్లిపూడి వెంకట్రావు,

కార్యదర్శులు. అత్తిలి బాబి, షేక్ బాషా, ఎర్ర వెంకటేశ్వరరావు, పల్లా బాలాజీ, చిలుకూరి శివ, పాలిశెట్టి సుబ్బారావు, తాడేపల్లి రాజు, సందక కొండ, శెట్టి సింహాచలం, దూలపల్లి ఆనంద్, బసవ సామ్యేలు, రామిశెట్టి నాగు, నాగిరెడ్డి శ్రీను, రోకళ్ళ ఏసు, గుంటుపల్లి గణేష్,బండారు నాగు తదితరులు పాల్గొన్నారు...

## బాల్యం నుంచే భారతీయ సంస్కృతి - నేర్పించాలి ఎమ్మెల్యే బొలిశెట్టి




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 09.**బాల్యం నుంచే భారతీయ సంస్కృతి ఔన్నత్యాన్ని బోధించాలని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో శ్రీ విశ్వ విజ్ఞాన విద్య, ఆధ్యాత్మిక పీఠం 98 వ వార్షిక మహాసభలలో సోమవారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. డా. ఉమర్ అలీషా ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఠాపురంలో ఆధ్యాత్మిక పీఠాలు హిందూ ధర్మానికి దోహదపడుతున్నాయని, రాష్ట్రంలో హిందూ మతానికి గురువులు, పీఠాధిపతులు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నారని అన్నారు. ఉమర్ అలీషా ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్క తల్లిదండ్రులు పిల్లలకు చిన్ననాటి నుండే మన దేశ సంస్కృతి బోధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం జనసేన పార్టీ నాయకులు కాకినాడ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్(బాబి) పుల్లా బాబి, చాపల రమేష్, మద్దాల మణికుమార్, అడ్డగర్ల సూరి, గట్టెం నాని, పిడుగు రామ్మోహన్ బ్రదర్స్, సిద్ధ వీర్రాజు,మలపాక చిట్టి, నల్లగంచి రాంబాబు, బైన పాలెపు ముఖేష్, దారపురెడ్డి శ్రీనివాస్, ఉడత బాలాజీ,

# టిడ్కో ఇంటి పట్టాలు సర్వే చేయించి నిజంగా ఇల్లు లేని పేదలకు అందజేత

## రూ.2.40 కోట్లతో ప్రభుత్వ నూతన షాపింగ్ కాంప్లెక్స్ కు గోరంట్ల శంకుస్థాపన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9 :** ఇంటి పట్టాలు పొందిన చాలామంది నివాసం ఉండడం లేదని అద్దెకిస్తున్నారని, వాటన్నిటిని సర్వే చేయించి నిజంగా ఇల్లు లేని పేదలందరికీ అందిస్తామని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. సోమవారం బొమ్మూరు కలెక్టరేట్ వెనక ఉన్న టిడ్కో గృహాల వద్ద రూ. 2.40 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించే ప్రభుత్వ షాపింగ్ కాంప్లెక్స్ (లైవ్లీ హుడ్ సెంటర్)కు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ నూతన షాపింగ్ కాంప్లెక్స్ (లైవ్లీహుడ్ సెంటర్) టిట్కో జీవన ఉపాధి కేంద్రం జి ప్లస్ త్రీ విధానంలో 20 షాపులు నిర్మిస్తున్నామన్నారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులు షాపులు నిర్మించి, మూడవ అంతస్తులో మినీ హాలు తయారుచేసి శుభకార్యాలకు అందుబాటులోకి తేస్తానని ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. నూతనంగా నిర్మించే 20 షాపులలో వ్యాపారాలకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. శానిటేషన్ మరింత శుభ్రపరిచే చర్యలు తీసుకుంటానని, జల జీవన్ మిషన్ పథకంలో త్వరలో ప్రతి ఇంటికి శుద్ధి చేసిన గోదావరి నీటిని అందిస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలో హాస్పిటల్ , స్కూల్ నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. స్థానిక మహిళల అభ్యర్థన మేరకు రామాలయం నిర్మించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, నున్న కృష్ణ, పుక్కళ్ళ రాజు, భీమరశెట్టి రమేష్, యడ్ల మహేష్, ఒంటెద్దు స్వామి, ఆళ్ల ఆనందరావు, బత్తిన ఏడుకొండలు, దొడ్డి బాబ్జి, నళ్ళ రమేష్, గుబ్బల దశరథ్, బొమ్మిడి శ్రీదేవి, టిడ్కో ఎస్.ఇ గంగరాజు, డి.ఇ సురేంద్ర, ఏ.ఇ సూర్యకుమార్, ఎంపీడీవో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, ఎమ్మార్వో శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి వెంకట్రావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# కోదండ రాముడు దీవెనలు అందరికి అందాలి





**చల్లా శ్రీనివాస శాస్త్రి.**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఫిబ్రవరి 09.**శ్రీ రామ కోదండం అయోధ్య లో కట్ట భోయే కళ్యాణ్ రామాలయం లో పెట్ట భోయే దేవాలయం లోకి 14 కిలోల ధనురుబాణం కేజీ బంగారం 13కిలోల పంచాలోహాలు తో తయారు చేయించిన కోదండం ని ప్రజలందరూ దర్శించు కోవాలని అయోధ్యనివాసి చల్లా శ్రీనివాస శాస్త్రి అన్నారు. స్థానిక పేరిచర్ల ఫౌండేషన్ కార్యాలయం వద్ద భక్తులు దర్శనార్థం స్వర్ణ ధనస్సు ని ఉంచారు. నడింపల్లి బంగారాజు మాట్లాడుతూ 108 అడుగుల శ్రీ రాములవారి విగ్రహం, 54, అడుగుల హనుమాన్ విగ్రహం మరియు శ్రీ రామ వంశం, సీతమ్మ వారి వంశం మొత్తం 508 విగ్రహాలు ప్రతిష్ట కై ఏర్పాటు జరుగుతున్నాయి అన్నారు చల్లా శ్రీనివాస శాస్త్రి టూర్ కో ఆర్డినేటర్, నడింపల్లి బంగారు రాజుని లయన్స్ గట్టిం మాణిక్యాల రావు సాగిసీతా రామరాజు నరేష్ లు శాలువాలతో సన్మానించారు.

లయన్ గట్టిం మాణిక్యాల రావు మాట్లాడుతూ ఈ ప్రాంతశీ ప్రజలు కోరిక పై మరొక సారి స్వర్ణ ధనస్సు దర్శనం ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు లయన్ పేరిచర్ల మురళీ కృష్ణం రాజు మాట్లాడుతూ దేశం మొత్తం శ్రీ రామ స్మరణ తో మారు మోగాలని దైవం ఎక్కడైతే పూజ లందు కుంటుందో ఆ ప్రాంతం సుబిక్షం గా ఉంటుంది అని ఈ విల్లు ని తీసుకు రావడం జరిగింది అన్నారు. ఎన్వీ రమణారావు ఆరేపల్లి ఉమా మహేశ్వర రావు డా కంచర్ల లక్మి నరసింహ సాగి సీతా రామరాజు, భూపతి రాజు చిట్టీ బాబు, దంగేటి ముఖర్జీ, బోళ్ళ రాము. ముదునూరి శివరామ రాజు, గాదిరాజు అచ్యుతరామరాజు వేజెల్ల శ్రీనివాస రాజు, గురజాడ ఆనంద్ కుమార్, గొల్లపూడి వెంకట ద్వారాకానాథ్, తమ్మా బత్తుల సత్యనారాయణ, ధనరాజు,సతీష్ తదితరులు పాల్గొన్నారు

# జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కోరుతూ ఏ ఐ ఎస్ ఎఫ్ సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేత



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9 :**రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఘనంగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలలో కీలకమైన జాబ్ క్యాలెండర్ విడుదల నిరుద్యోగ భృతి అమలు ఇప్పటికీ కాగితాలకే పరిమితమవడం పట్ల, తూర్పుగోదావరి జిల్లాలోని నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వెల్లువెత్తుతోందని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ తీవ్రంగా విమర్శించింది.

ఈ నేపథ్యంలో, తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువత తరఫున సబ్ కలెక్టర్ కి రాజమహేంద్రవరం లో ఒక సమూహ వినతిపత్రాన్ని సోమవారం సమర్పించినట్లు ఫెడరేషన్ జిల్లా నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ

ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై యువత ఓటు వేసిందన్నారు .కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ క్యాలెండర్ విడుదలపై గానీ, నిరుద్యోగ భృతి అమలుపై గానీ ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

రోజులు, నెలలు గడుస్తున్నా స్పష్టమైన ప్రకటనలు లేకపోవడం వల్ల లక్షలాది నిరుద్యోగ యువత భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందని, ఈ పరిస్థితికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని నాయకులు స్పష్టం చేసారు. ఈ పోరాటం నిరుద్యోగ యువత జీవన హక్కుల కోసం జరుగుతున్న పోరాటమేనని, రాజకీయ లాభాపేక్ష లేదని స్పష్టం చేసారు.. ప్రభుత్వం ఇకనైనా స్పందించకపోతే, యువతలో పెరుగుతున్న ఆగ్రహాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధమైన, శాంతియుత ఉద్యమాల రూపంలో ఉద్ధృతంగా వ్యక్తపరచాల్సిన పరిస్థితి తప్పదని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ తూర్పుగోదావరి జిల్లా నాయకులు,కే. శ్రీనివాస్ పి. త్రిమూర్తులు కే సురేష్ డి యోసేపు అంబటి వెంకటేశ్వర్లు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విపత్తు నిర్వహణలో డ్రోన్లు పాత్ర ఎంతో కీలకం








**ఐఐటి ఆచార్యులు డాక్టర్ సర్వేంద్రనాథ్**

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఫిబ్రవరి 09.**వైర్ లెస్ కమ్యూనికేషన్, విపత్తు నిర్వహణలో డ్రోన్లు ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నాయని తిరుపతి ఐఐటి ఆచార్యులు డాక్టర్ సర్వేంద్రనాథ్ తెలిపారు. ఏపీ నిట్ లోని ఈసీఈ విభాగం, ఐఐటి హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో తిహన్ సహకారంతో డ్రోన్ టెక్నాలజీ వైర్ లెస్ కమ్యూనికేషన్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అనే అంశంపై ఎస్టీ విద్యార్థులకు ఐదు రోజులపాటు నిర్వహించనున్న వర్క్షాప్ ను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ నరసింహారావు బనవతు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధి డాక్టర్ సర్వేంద్రనాథ్ మాట్లాడుతూ వ్యవసాయం, నిఘా, మ్యాపింగ్, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో డ్రోన్ల వినియోగం రోజురోజుకు పెరుగుతుందని చెప్పారు. విపత్తు ప్రాంతాలను సర్వే చేయటం, కమ్యూనికేషన్ వ్యవస్థలను పునరుద్ధరించటం, శోధన మరియు రక్షణ చర్యలకు సహాయపడటం వంటి పనులను డ్రోన్లు అత్యంత వేగంగా సమర్థవంతంగా నిర్వహించి ప్రాణాలను కాపాడుతున్నాయని చెప్పారు. మనుషులు వెళ్లలేని ప్రాంతాలకు సైతం సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో డ్రోన్లను పంపి సమాచారాన్ని సేకరిస్తున్నారని తెలిపారు.

విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ముందుకు సాగాలని వివరించారు. తిహాన్ హబ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సంతోష్ రెడ్డి ఆన్లైన్ ద్వారా మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ ప్రాముఖ్యత, వాటి ప్రయోజనాలు, యూఏవి కమ్యూనికేషన్ సిగ్నల్ ప్రాసెసింగ్, నియంత్రణ విధానాలు, డిజాస్టర్ మేనేజ్మెంట్ అప్లికేషన్ల గురించి తెలియజేశారు. ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చుదిద్దుకునేందుకు ఇటువంటి వర్క్షాప్ లు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేవరపల్లిలో విద్యుత్ సరఫరా కు అంతరాయం.

**ఈ ఈ అప్పారావు.**

**గోపాలపురం ,పెన్ పవర్, ఫిబ్రవరి 9.**నియోజకవర్గంలోని దేవరపల్లి సెక్షన్ పల్లంట్ల 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ నారాయణ అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. పల్లంట్ల సబ్ స్టేషన్ లో మెయింటెనెన్స్ పనులు నిమిత్తం నిలుపుదల చేయనున్నామన్నారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందన్నారు. పల్లంట్ల టౌన్ లీడర్, పల్లంట్ల వ్యవసాయ ఫీడర్, రాతి చెరువు, చిక్కాల, లక్ష్మీపురం, పాశాలమ్మ విద్యుత్ పీటర్లు ఆపి వెయ్యడం జరుగుతుందన్నారు. వ్యవసాయ విద్యుత్తును రాత్రి 1:00 నుండి 9 గంటల వరకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వినియోగదారుల సమస్యను అర్థం చేసుకొని సహకరించాలని అప్పారావు కోరారు.

# పరిశుభ్ర, ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం అవసరం

✷ అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9** :స్వచ్ఛ రాజమహేంద్రవరం నిర్మాణంలో భాగంగా నగరపాలక సంస్థ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వచ్ఛోత్సవ్' కార్యక్రమాలలో భాగస్వామ్యులు కావాలని వర్తక సంఘాలకు అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్ నందు రైతుబజార్, పూల , చేపల మార్కెట్ వ్యాపారులు, హోటల్స్ అసోసియేషన్, సినిమా థియేటర్ అసోసియేషన్ సభ్యులు, వీధి వ్యాపారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. నగరాన్ని ఉత్తమ పరిశుభ్ర , పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈనెల 6 నుండి మార్చి 6 వరకు ఆర్ఎంసి ఆధ్వర్యంలో పలు స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టినట్లు అదనపు కమిషనర్ వెల్లడించారు. బాధ్యతగల పౌరులుగా రోడ్లపైన, కాలువలలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయకుండా ప్రతి వ్యాపార కేంద్రం వద్ద చెత్తబుట్టలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. తినుబండారాలలో సిల్వర్, అల్యూమినియం ఫాయిల్స్ వాడటం వల్ల గ్యాస్ట్రిక్, ఎముకల సమస్యలతో పాటు క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కచ్చితంగా జరగాలని, ప్లాస్టిక్ ను విక్రయించినా, ప్లాస్టిక్ కవర్లతో సరుకులు ఇచ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న పుష్కరాల నేపథ్యంలో స్వచ్ఛ రాజమహేంద్రవరాన్ని నిర్మించుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. 2024-25 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో నగరానికి ప్రతిష్ఠాత్మక ప్రామిసింగ్ స్వచ్ఛ షెహర్ అవార్డు వచ్చిందని అదనపు కమిషనర్ గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఎంహెచ్ఓ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్, వర్తక సంఘాల ప్రతినిధులు, శానిటరీ ఇన్స్ పెక్టర్లు, ఇతర పబ్లిక్ హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు

# మోహన్ మృతి టిడిపికి తీరని లోటు-జగదీశ్వరి.

పోలవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9.

తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని మోహన్ మృతి టిడిపికి తీరని లోటు అని రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ నిర్వాహకరాలు కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. మోహన్ రహదారి ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జగదీశ్వరి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కుటుంబీకులకు అత్యంత ఆప్తులైన మోహన్ రాష్ట్రంలోని ఎంతోమంది యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పార్టీ అభివృద్ధి కోసం ఒకవైపు అహర్నిశలు శ్రమిస్తూ మరోవైపు యువతను ఉత్తేజపరుస్తూ ఏకతాటిపైకి తీసుకువచ్చిన మంచి నాయకుడిగా అభివర్ణించారు. పార్టీ సిద్ధాంతాలను గుండెల్లో పెట్టుకొని అందుకు అనుకూలంగా నడుస్తూ యువతలో రాజకీయ చైతన్యం తీసుకువచ్చారన్నారు. పార్టీకి సంబంధించిన ఆశయాలను గ్రామ గ్రామాన విస్తరింప చేయడానికి నడుం బిగించిన నాయకుడు అన్నారు. ఆయన సేవలు వెలకట్టలేనివని ఆయన మృతి బాధాకరం అని వాపోయారు. అటువంటి వ్యక్తి మృతి తమను కలచివేసిందని జగదీశ్వరి పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరుకున్నారు.

# అధికారులు కదలరు..సమస్యలు తీరవు





**-గురకలపేటలో సదుపాయాలు దూరం**

**-పారిశుధ్య లోపాలతో జనాలు బెంబేలు**

**ఏలూరు ఫిబ్రవరి 9 పెన్ పవర్ :** ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి పంచాయితీ పరిధిలోని గురకలపేట కాలనీ ఏర్పడి 7ఏళ్లు దాటినా పలు సమస్యలు పరిష్కారం కావడం లేదని కాలనీ నివాసితులు ఆందోళన చెందుతున్నారు. 2018లో టిబిపి ప్రభుత్వ హయాంలో కాలనీ ఏర్పాటు చేశారు. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో కాలనీలో అభివృద్ధి కుంటుపడింది. ప్రధానంగా పారిశుధ్య లోపం ప్రజలను వేధిస్తోంది. డ్రైనేజీలు,సిమ్మెంటు రహదారులు లేక రాకపోకలకు ఇక్కట్లు ఎదుర్కోంటున్నారు. ప్రధాన రహదారుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని స్దానికులు కోరుతున్నారు. కాలనీలో అంగన్ వాడీ స్కూల్,మండల పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటికి డ్రైనేజీ సౌకర్యంలేక వాడకం నీరు ఆవరణలోనే నిలిచిపోతొంది. కాలనీలో ప్రధాన సమస్య డ్రైనేజీలు లేక పోవడంతో ఇళ్లలోలి వాడుక నీరు పైపులు అమర్చి కచ్చా డ్రైన్లలలో వదులుతున్నారు. వర్షాకాలంలో మురుగునీరు పారక కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి ముంపునకు గురవుతొంది. డ్రైనేజీలలో మురుగు పారుదల వ్యవస్ద లేక కచ్చాడ్రెయిన్‌లలో రసాయనాలు వెద జల్లకపోవడంతో ,మురుగు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జరిగి విస్తరిస్తున్నా ,కాలనీ వాసులకు సరిపడా తాగునీరు సరఫరా కావడం లేదని,కాలనీ మహిళలు పేర్కోంటున్నారు. కాలనీలో సిమ్మెంట్ రహదారులు లేక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో సేకరించిన చెత్తా చెదారాలను డంపింగ్ యార్డుకు తరలించకుండా మాదేపల్లి-శ్రీపర్రు ఆర్అండ్‌బి రహదారి అంచున పారబోస్తున్నారు. ఇక్కడ బస్టాప్ షెల్టర్ లేక బయటి ప్రాంతాలకు ప్రయాణించాలంటే బస్సుల కోసం ఎండలో,వర్షంలో నిరీక్షించాల్సిందేనని కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో డ్రైనేజీలు,రోడ్‌లు అభివృద్దికి నిధులు మంజూరు చేసి కాలనీ అభివృద్ధి చేయాలని నివాసితులు కోరుతున్నారు.

# సిమెంట్ రోడ్డు నిర్మించిన రెండు నెలలకే మరమ్మతులు...





**సంబంధిత అధికారుల నిర్లక్ష్యం**

**కూనవరం,పెన్ పవర్,ఫిబ్రవరి 9.**గోదావరి వరదలకు మండలంలోని పోలిపాక గ్రామం వద్ద తరచు రోడ్డు కోతకు గురవుతుండడంతో ప్రభుత్వం సుమారు 48 లక్షలతో సిమెంట్ రోడ్డును మంజూరు చేసింది. మండలంలోని ప్రజలు, వాహనదారులు సంతోషం వ్యక్తపరిచారు. సిమెంట్ రోడ్డు యుద్ధ ప్రాతిపదికన వేశారు. రెండు నెలలకే ఎక్కడికక్కడ పగుళ్లు రావడం,రోడ్డు గుంతలు పడిపోవడంతో అక్కడ ఉన్న స్థానిక ప్రజలు,వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యానికి ఈ రోడ్డు నిదర్శనమని అన్నారు. తరచూ గోదావరి వరదలు రావడం,రోడ్డు కోతకు గురి కావడం మేము ఇబ్బందులు పడడం జరుగుతుంది. ప్రభుత్వం మా బాధలను గుర్తించి సిమెంట్ రోడ్డును మంజూరు చేసి,యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తే ఎక్కడికక్కడ పగిలిపోవడం, గుంతలు పడడంతో,తరచూ వచ్చే గోదావరి వరదలకు రోడ్డు కోతకి గురికాకుండా ఆగుతుందని నమ్మకం లేదని మళ్లీ ఈ బాధలు మాకు తప్పవని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. నాణ్యతలేని రోడ్డు నిర్మించడం,సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే రోడ్డు నిర్మాణం నాసిరకంగా సంబంధిత కాంట్రాక్టర్ నిర్మించారని అన్నారు. స్థానిక ప్రజలు నిలదీయడంతో కాంట్రాక్టర్ వెంటనే నిర్మించిన రోడ్డుపై సిమెంట్,ఇసుక కలిపి పై పోత పోసి మామ అనిపించారు. నాణ్యతలేని సిమెంట్ రోడ్డు నిర్మించడం కాంట్రాక్టర్ తప్పిదమా లేక అధికారులు నిర్లక్ష్యమా అని ఇందుకు బాధ్యులు ఎవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు .

# ఎం.పి.డి.వో.కు ఘనంగా సాలువాతో సన్మానం -టిడిపిపార్టీ మండల నాయకులు -ఎం.పి.డి.వో.కార్యాలయం సిబ్బంది.



**వి.ఆర్.పురం**

**పెన్.పవర్.పిబ్రవరి.9:**విశాఖపట్నంలో జరిగిన పంచాయతీరాజ్ కమిషనర్, ఆద్వర్యంలో నిర్వహించిన రివ్యూ మీటింగ్ లో హౌస్ టాక్స్ లో ఉత్తమ పనితీరు కనబరిచిన జాబితాలోవి. ఆర్.పురం ఎం.పీ.డీ.వో.ఇమ్మానుయేలుకు పంచాయ తీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ కమిషనర్,ద్వారాప్ర శంసా పత్రాన్నిఅందజేశారు. ఈవిషయం తెలుసుకున్న మండల టిడిపినాయకులు సోమవారం మండలఎం.పి.డి.వో.ఇమ్మానుయేలుకు ఘనంగా సాలువాతో సన్మానం చేశారు. ఈకార్యక్రమంలోటిడిపిమండల నాయకులు ఎం. పి.డి.వో.కార్యాలయం సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు.

# ఎటపాక జనసేన కమిటీతో ఎమ్మెల్సీ హరిప్రసాద్, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భేటీ



**చింతూరు పెన్ పవర్ ఫిబ్రవరి 9:**ఎటపాక మండల జనసేన పార్టీ నాయకులు ఆదివారం రాజమండ్రిలో జనసేన ఎమ్మెల్సీ, పార్టీ వ్యవహారాల కమిటీ అధ్యక్షులు హరిప్రసాద్‌ను, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను వారి స్వగృహంలో కలిశారు. మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, స్థానిక సమస్యలపై చర్చించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు, 40 అడుగులకే మునిగే గ్రామాలను 41.5 కాంటూర్‌లో చేర్చడంలో జరుగుతున్న జాప్యం, ఎటపాక మండల రోడ్ల పరిస్థితి, మండల కేంద్రంలో నూతన ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణంపై నేతల దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని, 10 రోజుల్లో నియోజకవర్గ సమావేశం నిర్వహిస్తామని నేతలు హామీ ఇచ్చారు.

# గోపాలపురంలో పర్యటించిన ఎమ్మెల్యే మద్దిపాటి.

టిడిపి అధ్యక్షులు రాము.

**గోపాలపురం పెన్ పవర్ ఫిబ్రవరి 9.** స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు మంగళవారం మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొర్లపాటి రాము సోమవారం ఒక ప్రకటనలు తెలిపారు. ఉదయం రాజం పాలెం గ్రామం నుండి నరసన్న పాలెం వరకు నూతనంగా నిర్మించనున్న రహదారి నిర్మాణానికి భూమి పూజ చేయనున్నారు. అలాగే గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. అనంతరం హుకుంపేట గ్రామంలో పంచాయతీకి చెందిన త్రాగునీటి ట్యాంకు ప్రారంభోత్సవం తరువాత గ్రామంలోని మహిళా సమైక్య సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం దొండపూడి, రాజం పాలెం గ్రామాలలో పలువురుని ఎమ్మెల్యే పరామర్శిస్తారు అన్నారు. సాయంత్రం వేళ్ళ చింతల గూడెం గ్రామంలో జరగనున్న టిడిపి సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే వెంకట్రాజు ముఖ్యఅతిథిగా హాజరవుతారని రాము తెలిపారు. ఈ కార్యక్రమాలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు రావాలని ఆయన కోరారు.

# డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్ పరిశీలన... ట్రాఫిక్ నియంత్రణపై ఎస్సై డి. రామ్ కుమార్. ప్రత్యేక దృష్టి



**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9:**తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు స్మార్ట్ పోలింగ్ భాగంగా నార్త్ జోన్ డిఎస్పి వై శ్రీకాంత్ కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ వి వి ఎస్ మూర్తి యొక్క పర్యవేక్షణలో సీతానగరం మండలంలోని ఎస్సై డి.రామకుమార్ తమ సిబ్బందితో సోమవారం నాడు రఘుదేవపురం రహదారిపై రోడ్డు పనులు జరుగుతున్న ప్రదేశంలో డ్రోన్ కెమెరా పర్యవేక్షణ ద్వారా ట్రాఫిక్ ను కంట్రోల్ చేస్తూ ప్రజలకు మరియు పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ ఎటువంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవాహనాల రాకపోకలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పై ప్రధాన దృష్టి సారిస్తున్నామన్నారు. ట్రాఫిక్ జామ్ కాకుండా డ్రోన్ల ద్వారా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఇరుకు రోడ్లలలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో పరిశీలన చేసి సమీక్షించారు. ఇకపై రహదారి భద్రత నియమాలు పాటిస్తే, సానుకూలంగా వ్యవహరిస్తామని, లేకుంటే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను అనుమతించవద్దని, డ్రైవరు సీటులోకి ప్రయాణికులను కూర్చోబెట్టవద్దని, ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలని, నిబంధనలకు విరుద్ధంగా స్కూలు పిల్లలను అనుమతించవద్దన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని వాహనాలు నడిపేటప్పుడు వ్యక్తిగత భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. ఈ నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

# పంచాయితీ అభివృద్ధి అధికారులతో అడ్డతీగల ఎంపీడీవో కుమార్ సమావేశం...



**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి, 09:** పంచాయతీ అభివృద్ధి అధికారులతో సోమవారం అడ్డతీగల ఎంపీడీవో కుమార్ సమావేశంలో నిర్వహించారు . ఈ సమావేశంలో ముఖ్యంగా కుటుంబాల సమగ్ర సర్వే మరియు సిటిజన్ ఈ కేవైసీ సర్వే సచివాలయం సిబ్బంది మందకొడిగా చేస్తున్నారని, తగు సూచనలిచ్చి త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో కుమార్ ఆదేశాలు జారీ చేశారు . అలాగే ఇ- సర్వీసెస్, ఎమౌంట్ ప్రతి రెండు రోజులకు ప్రభుత్వ హెడ్ కి జమ చేయాలని, అలాగే వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రతి వారం పాఠశాల తనిఖీలు చేయాలని, తగు సూచనలు జారీ చేశారు . గ్రామ సచివాలయ సిబ్బంది అందరూ కూడా ఇన్ - టైమ్ మరియు అవుట్ - టైమ్ 100% పక్కాగా సచివాలయ సిబ్బంది అందరూ వెయ్యాలని సచివాలయం కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది అటెండెన్స్ వేయనివారు అనధికారికంగా గైర్హాజర్ అయ్యారని భావించి వారు గైర్హాజరు అయిన దినములకు జీతం నిలుపుదల చేయవలసినదిగా ఎంపీడీవో కుమార్ ఆదేశాలు జారీ చేశారు .

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కార్మిక వెట్టిచాకిరి నిర్మూలనకై అవగాహన ర్యాలీ



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 9:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బాండేడ్ లేబర్ రహిత జిల్లాగా నిలవాలంటే ప్రజల సహ కారం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కలెక్ట రేట్ నందు బంధిత కార్మిక వెట్టి చాకిరి నిర్మూలన చట్టాన్ని పురస్కరించుకొని ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి నల్లవంతెన వరకు నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్థానిక కలెక్ట రేట్ నందు ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ వెట్టి చాకిరి వ్యవస్థను చట్ట విరుద్ధం చేసి బలహీన వర్గాల ఆర్థిక శారీరక దోపిడీని నిరోధించడానికి వేట్టి చాకిరి నిర్మూలన చట్టం రూపొందించబడి నేటికి 50 సంవత్సరాలు అయిందని తెలిపారు. వెట్టిచాకిరి అనేది చట్టరీ త్యా నేరమని, ఫిబ్రవరి 9వ తేదీని వెట్టిచాకిరి నిర్మూలన దినంగా నిర్వహిస్తున్నారన్నారు. వెట్టిచాకిరి అనేది ఒక వ్యక్తి లేదా అతని కుటుంబ సభ్యులు తీసుకున్న అప్పు, ముందస్తు రుణం లేదా సామాజిక బాధ్యతల కారణంగా, అప్పు తీర్చే నిమిత్తం యజమాని వద్ద బలవంతంగా పని చేయిం చబడే వ్యవస్థ అన్నారు. ఈ వ్యవస్థలో కూలీకి తనకు నచ్చిన పని ఎంచుకునే స్వేచ్ఛ ఉండదన్నారు. ఎక్కడికైనా వెళ్ళే స్వేచ్ఛ కూడా కోల్పోతాడన్నారు. చాలా సందర్భాల్లో సరైన వేతనం ఇవ్వకుండా లేదా అతి తక్కువ వేతనంతో పని చేయిస్తారన్నారు అధిక వడ్డీ, తప్పుడు లెక్కలు, వేతనంలో కోతలు వంటి వాటి వల్ల అప్పు ఎప్పటికీ తీరని విధంగా చేస్తారన్నారు. ఈ విధమైన బానిస కూలి వ్యవస్థ తరతరాలకు కొనసాగు తుందని మరియు ఆర్థికంగా, సామాజికంగా బలహీ న వర్గాలపై ఎక్కువ ప్రభా వం చూపుతుందన్నారు. భారతదేశంలో వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం, 1976 ప్రకారం ఈ విధమైన వ్యవస్థ పూర్తిగా నిషేదించ బడిందన్నారు. 1975 అక్టోబ ర్ 24న తీసుకు వచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో 1976 లో పూర్తి చట్టంగా అమలైందన్నారు. దీని ద్వారా వెట్టి చాకిరి రద్దుతో పాటుగా, బంధిత కార్మికుల విముక్తి రుణ మాఫీ చేసిందన్నారు. ఈ చట్టం ద్వారా లక్షలాది మంది కార్మి కులు విముక్తి పొందారన్నారు. అయితే ఇంకా కొన్ని ప్రాంతాలలో ఈ వ్యవస్థ ఉనికిలో ఉందని నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. పూర్తిస్థాయి లో నిర్మూలనకై జిల్లా వ్యాప్తంగా అవగాహన ర్యాలీలు సమావేశాలు నిర్వహించి చట్టం అమలు కార్మిక హక్కుల గురించి అవ గాహన కల్పించడం జరుగుతోందన్నారు. అందరూ కలిసి బంధిత కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు అంకితభావంతో కృషిచేయాలన్నారు. రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కుల ప్రకారం ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా గౌరవంతో జీవిం చే హక్కు ఉందని అయిన ప్పటికీ, కొన్ని చోట్ల ఇంకా బాండేడ్ లేబర్ రూపంలో మానవ హక్కుల ఉల్లంఘ నలు జరుగుతుండటం ఆందోళన కలిగించే విషయ మన్నారు. డిఆర్వో కొత్త మాధవి మాట్లాడుతూ బాండేడ్ లేబర్ నిర్మూ లన దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ర్యాలీ ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడం కార్య క్రమ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఎవరైనా బానిస కార్మిక వ్యవస్థలో ఉన్నారని గమ నించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలనీ కోరారు ప్రభుత్వం బాధితులకు చట్టపరమైన రక్షణతో పాటు పునరావాసం, ఆర్థిక సహాయం అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. బాండేడ్ లేబర్ నిర్మూలన ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని సమాజం మొత్తం కలిసి చేపట్టాల్సిన ఉద్యమమన్నారు. ప్రతి పౌరుడు ఈ అంశంపై జాగ్రత్తగా ఉండి, మానవ హక్కుల పరిరక్షణకు తోడ్పడాలన్నా రు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ టీ నాగలక్ష్మి ప్రసంగిస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా వెట్టి చాకిరి కేసులు ఎక్కడ నమోదు కాలేదని తెలిపారు. ఈ ర్యాలీ ద్వారా అంద రూ ఒక స్పష్టమైన సంకల్పం చేస్తూ బానిసత్వానికి తావులేని సమాజం, స్వేచ్ఛతో నిం డిన భవిష్యత్ మన లక్ష్యం కావాలనే నినాదాలతో ర్యాలీ ఆద్యంతం ముందుకు సాగింది. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు ఏ మాధవి సిహెచ్ మనోజ్, మల్లేశ్వ రరావు, సమగ్ర శిక్ష అసి స్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి మమ్మీ,, మొబలైజేషన్ అధికారి బివివి సుబ్రహ్మ ణ్యం, ఏవో కాశీ విశ్వేశ్వర రావు, వెట్టి చాకిరి ఆర్గనై జేషన్ సభ్యు లు అలర్ట్, సార్క్ ఎన్జీవోల ప్రతినిధులు సేవ్ నేచర్ మహిళా సంఘాల ప్రతి నిధులు లేబర్ వర్కర్స్ యూనియన్ ప్రతి నిధులు, కిమ్స్ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## శ్రీ వీరేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



**పోలవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 9:**పట్టిసం నిధిపై శ్రీ వీరేశ్వర స్వామి, శ్రీ భావనారాయణ స్వామి దేవస్థానాల హుండీలు సోమవారం ఉదయం తెరిచి లెక్కించారు. వీరేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.5,73,460, భావనారాయణ స్వామి హుండీ ఆదాయం రూ. 38,915 వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో తనిఖీదారు, ఈవో, రాజా కొచ్చర్లకోట వీరభద్రరావు, ట్రస్ట్ ధర్మకర్తలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న బొడ్డు దంపతులు..

ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు..



**కోరుకొండ,పెన్ పవర్, ఫిబ్రవరి 9:** తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి దంపతుల వివాహ మహోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం విజయవాడ శ్రీ కనక దుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీస్సులు తీసుకున్నరు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ ప్రజాప్రతినిధులు బొడ్డు వెంకటరమణ చౌదరి కు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పల్లకడియం గ్రామస్తుల చిరకాల కోరిక తీర్చిన ఎమ్మెల్యే బత్తుల..



**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 9:** రాజానగరం మండలం పల్లకడియం గ్రామస్తుల చిరకాల కోరిక అయిన శ్రీకృష్ణపట్నం పంపు హౌస్ నుండి పల్లకడియం గ్రామానికి సాగునీరు గ్రామ ప్రజల సమక్షంలో రాజనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు గ్రామస్తులు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు చిరు సత్కారం చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం,బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

# పొంచిఉన్న ప్రమాదం



**ఏలూరు పిబ్రవరి 9 పెన్ పవర్:** ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి పంచాయితీ పరిధిలోని గురకల పేట కాలనీలో వీధి దీపాలకు విద్యుత్ సరఫరా చేసే ఫ్యూజ్ బాక్స్ రోడ్ పై స్దంబానికి పాదచారులకు, మూగజీవాలకు అందినంత ఎత్తులో ప్రమాదకరంగా ఉంది.తలుపులు లేకుండా నేలకు తాకి విధంగా అమర్చడంతో ఆందోళన కలిగిస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు.ట్రాన్స్కో అధికారులు పరిశీలించి ప్రమాద నివారణకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు

## చింతలూరు శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవానికి విరాళం



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 09;**చింతలూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో అన్నదానం నిమిత్తం దాసరి బాబురావు (వెంకట్రావు) కుమారుడు గణేష్,వారి కుటుంబం రూ.50 వేలు గోపరంధామం గోశాల, అన్నదానం ట్రస్ట్ కు భక్తి విరాళం అందించారు. దాతలకు స్వామివారి భక్త బృందం కృతజ్ఞతలు తెలియజేశారు.

# అభివృద్ధిసంక్షేమం కూటమి పాలనకు రెండు కళ్లే



* ఆత్రేయపురం మండలంలో రూ.6.96 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
* కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి9:**రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రూ.3 కోట్ల 72 లక్షలతో చేపట్టిన రహదారులు, డ్రెయిన్ల వంటి అభివృద్ధి పనులకు, అలాగే రూ.3 కోట్ల 24 లక్షలతో నిర్మించనున్న వెల్నెస్ సెంటర్లకు కలిపి మొత్తం రూ.6 కోట్ల 96 లక్షల విలువైన పనులకు ఆయన శంకుస్థాపనలు, భూమిపూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్లెల్లో ఈ స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత చరిత్రలో లేదన్నారు. ప్రతీ గ్రామంలో మౌలిక సదుపాయాల కొరత లేకుండా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయన్నారు. మండలంలోని మెర్లపాలెంలో ఎమ్జీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రూ.27 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



వాడపల్లిలో రూ.36 లక్షలతో వెల్నెస్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. లొల్లలో వెల్నెస్ సెంటర్‌తో పాటు రూ.20 లక్షల సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు శంకుస్థాపన చేశారు.

ఉచ్చిలి, వెలిచేరు, పేరవరం, బొబ్బర్లంక, వసంతవాడ, తాడిపూడి, నార్కెడ్ మిల్లి, అంకంపాలెం, ర్యాలి గ్రామాల్లో కూడా వెల్నెస్ సెంటర్లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, బీటీ రహదారుల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ర్యాలి గ్రామంలో రెండు వెల్నెస్ సెంటర్లతో పాటు సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వచ్చే రోజుల్లో మరిన్ని పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వెల్లడించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "ఐ"టిడిపి నూతన కార్యవర్గం నియామకం



**ఆలమూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 09;**మండల ఐ టీడీపీ నూతన కార్యవర్గ కమిటీ సోమవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు నియమించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా లంక వినయ్, ప్రధాన కార్యదర్శిగా శిరంగుల సతీష్, ఇద్దరు ఉపాధ్యక్షులు తాడి రామకృష్ణా రెడ్డి, వైట్ల వీ వీ ఎస్ చౌదరి, ముగ్గురు కార్య నిర్వాహక కార్యదర్శులు సోమిరెడ్డి శివ, గానుగుల సతీష్, గుర్రం సంజీవ్ కుమార్, ముగ్గురు కార్యదర్శులు యార్లగడ్డ రవి, అన్యం నాగరాజు, సుంకర మణికంఠ (రాజు) ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం మా మీద ఉంచిన నమ్మకాన్ని వమ్ము కాకుండా చూసుకుంటామని, పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. దీంతో నూతన కార్యవర్గాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, కోనసీమ జిల్లా కార్యనిర్వహాక కార్యదర్శి వంటిపల్లి సతీష్, టిడిపి మండల కార్యదర్శి సలాది నాగేశ్వరావు, ఐటీడీపీ నియోజక వర్గ ఇంచార్జి కుసుమే సురేష్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు భావన శ్రీనివాస్, ఏఎంసి వైస్ చైర్మన్ కేతా రాంబాబు, నేత మానేపల్లి శ్రీను, తదితరులు అభినందించిన వారిలో ఉన్నారు.

## కోటి 93 లక్షల వ్యయంతో ర్యాలి గ్రామ అభివృద్ధి పనులకు శ్రీకారం



ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి 9:**ర్యాలి గ్రామంలోని పిటక వీధిలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మించనున్న హెల్త్ సెంటర్‌కు సోమవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శంకుస్థాపన చేశారు. కొబ్బరికాయ కొట్టి భూమిపూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ, ర్యాలి గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. గ్రామంలో రహదారులు, డ్రెయిన్లు, ఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పనకు మొత్తం రూ.1 కోటి 92 లక్షల నిధులు మంజూరైనట్లు వివరించారు. కొత్తగా నిర్మించనున్న హెల్త్ సెంటర్ ద్వారా గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పేద కుటుంబాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు (బాబు), ర్యాలి గ్రామ టీడీపీ అధ్యక్షులు పెండెం వెంకన్న, గ్రామ నాయకులు పేర్చర్ల పుల్లంరాజు వర్మ, మద్దూరి సుబ్బారావు, జగన్మోహిని కేశవ స్వామి ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, సచివాలయం సిబ్బంది, హెల్త్ సెంటర్ సిబ్బంది, గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులతో ర్యాలి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# ప్రేక్షకాదరణలో ఫుట్‌బాల్ కింగ్.. రెండో స్థానంలో క్రికెట్

**ప్రేక్షకాదరణలో ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌దే అగ్రస్థానం**
**150 కోట్ల వీక్షణలతో ఫుట్‌బాల్ తిరుగులేని ఆధిపత్యం**
**రెండో స్థానంలో క్రికెట్ ప్రపంచకప్.. నాలుగో స్థానానికి పడిపోయిన సూపర్ బౌల్**
**డిజిటల్ వీక్షణలో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న ఐపీఎల్**
**అమెరికాలో సూపర్ బౌల్‌కు క్రేజ్ ఉన్నా.. ప్రపంచవ్యాప్తంగా వెనుకంజ**




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతి ఏటా అమెరికాలో జరిగే సూపర్ బౌల్ ఈవెంట్ రాగానే, సోషల్ మీడియాలో ఓ పెద్ద చర్చ మొదలవుతుంది.
ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడా ఈవెంట్ ఇదేనంటూ పాశ్చాత్య అభిమానులు వాదిస్తుంటారు. కానీ, వాస్తవ లెక్కలు చూస్తే ఈ వాదనలో వాస్తవం లేదని స్పష్టమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ఫుట్‌బాల్ (సాకర్) తిరుగులేని రాజుగా నిలుస్తుండగా, డిజిటల్ వీక్షణలో క్రికెట్ వేగంగా దూసుకొస్తోంది. అమెరికాలో సూపర్ బౌల్‌కు ఎంత క్రేజ్ ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్త ప్రేక్షకాదరణలో దాని స్థానం చాలా వెనుక ఉంది.

**ఫిఫా ప్రపంచకప్.. తిరుగులేని ఆధిపత్యం**

ప్రపంచంలో అత్యధిక మంది చూసిన ఫైనల్స్‌లో ఫిఫా ప్రపంచకప్‌దే అగ్రస్థానం. 2022లో ఖతార్ వేదికగా అర్జెంటీనా, ఫ్రాన్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను ప్రపంచవ్యాప్తంగా సుమారు 150 కోట్ల మంది వీక్షించారు. ఫిఫా అధికారిక లెక్కల ప్రకారమే ఈ సంఖ్య నమోదైంది. యూరప్, దక్షిణ అమెరికా, ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో ఏకకాలంలో ఇంత భారీ సంఖ్యలో వీక్షకులను ఆకట్టుకున్న ఏకైక ఈవెంట్ ఇదే.

**రెండో స్థానంలో క్రికెట్ ప్రపంచకప్**

ఫిఫా ప్రపంచకప్ స్థాయిలో కాకపోయినా, అత్యధిక వీక్షకులను సంపాదించుకున్న రెండో అతిపెద్ద ఈవెంట్‌గా క్రికెట్ ప్రపంచకప్ నిలిచింది. 2023లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన ఫైనల్‌ను సుమారు 50 కోట్ల మంది చూశారని ఐసీసీ, దాని అధికారిక ప్రసార భాగస్వాములు అంచనా వేశాయి. ముఖ్యంగా దక్షిణాసియా దేశాల్లోని అపారమైన జనాభా ఈ సంఖ్యకు కారణమైంది. బార్క్ (దీూ=జ) డేటా ప్రకారం కేవలం భారత్‌లోనే డిస్నీ స్టార్ నెట్‌వర్క్‌పై ఈ మ్యాచ్‌కు 422 బిలియన్ల వీక్షణ నిమిషాలు నమోదయ్యాయి.

**ఐపీఎల్, సూపర్ బౌల్ స్థానం ఎక్కడ?**

ఇక, ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కేవలం దేశీయ లీగ్‌గా పరిమితం కాలేదు. 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ మధ్య జరిగిన ఫైనల్‌ను టీవీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో కలిపి దాదాపు 30 కోట్ల మంది వీక్షించారు. ఇది ప్రపంచంలోనే అత్యధికంగా వీక్షించిన టీ20 మ్యాచ్‌గా నిలిచింది.
మరోవైపు 2025లో ఫిలడెల్ఫియా ఈగల్స్, కాన్సాస్ సిటీ చీఫ్స్ మధ్య జరిగిన సూపర్ బౌల్ ఫైనల్ అమెరికన్ టెలివిజన్‌లో రికార్డులు సృష్టించింది. కానీ, ప్రపంచవ్యాప్తంగా దీని వీక్షకుల సంఖ్య 19 కోట్లకు మాత్రమే పరిమితమైంది. ఇందులో 12.7 కోట్లు అమెరికా నుంచే ఉండగా, అంతర్జాతీయ వీక్షకులు 6.2 కోట్లు మాత్రమే. వాణిజ్యపరంగా, ప్రకటనల పరంగా సూపర్ బౌల్ బంగారు గని అయినప్పటికీ, ప్రపంచ ప్రేక్షకాదరణలో మాత్రం ఫుట్‌బాల్, క్రికెట్‌ల కంటే చాలా వెనుకబడి ఉంది.

# ప్రపంచకప్‌లో మ్యాచ్ వదులుకుంటారా?.. గంగూలీ

**టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించిన పాకిస్థాన్**
**పాక్ నిర్ణయం విస్మయానికి గురి చేసిందన్న గంగూలీ**
**ప్రపంచకప్‌లో ప్రతీ పాయింట్ కీలకమని గంగూలీ వ్యాఖ్య**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించాలన్న పాకిస్థాన్ నిర్ణయంపై బీసీసీఐ మాజీ అధ్యక్షుడు, భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఈ నెల 15న కొలంబో వేదికగా ఈ మ్యాచ్ జరగాల్సి ఉండగా, పాక్ ఈ నిర్ణయం తీసుకోవడం తనను విస్మయానికి గురి చేసిందని ఆయన అన్నాడు.ఆదివారం విలేకరులతో మాట్లాడిన గంగూలీ.. "ప్రపంచకప్ నుంచి ఎందుకు తప్పుకుంటున్నారు? ఎలాగూ వాళ్లు శ్రీలంకలోనే ఆడుతున్నారు. పాకిస్థాన్ ఇలా వెనక్కి తగ్గడం నన్ను ఆశ్చర్యపరిచింది. ప్రపంచకప్ లాంటి టోర్నీలో ప్రతీ పాయింట్ ఎంతో ముఖ్యం" అని స్పష్టం చేశాడు. తటస్థ వేదికపై మ్యాచ్ జరుగుతున్నప్పటికీ పాకిస్థాన్ ఆడకపోవడాన్ని దాదా తప్పుబట్టాడు.ఈ టోర్నమెంట్ కోసం భారత్‌కు వెళ్లకూడదని బంగ్లాదేశ్ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా, టీమిండియాతో తమ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్.. గ్రూప్-ఏలో ఉంది. ఇదే గ్రూపులో పాకిస్థాన్‌తో పాటు నమీబియా, నెదర్లాండ్స్, యూఎస్ఏ జట్లు కూడా ఉన్నాయి.

# రంగంలోకి దిగిన ఐసీసీ.. భారత్‌తో మ్యాచ్‌పై 24 గంటల్లో పీసీబీ నిర్ణయం





**లాహోర్‌లో ఐసీసీ, పీసీబీ అధికారుల మధ్య 5 గంటలకు పైగా చర్చలు**
**పాక్ ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాతే తుది నిర్ణయం**
**ఈ చర్చల్లో పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచిన బంగ్లాదేశ్**
**ఈ నెల 15న జరగనున్న హై-వోల్టేజ్ మ్యాచ్‌పై వీడని అనిశ్చితి**

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే ప్రతిపాదనపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తన వైఖరిని రాబోయే 24 గంటల్లో స్పష్టం చేయనున్నట్లు తెలుస్తోంది. లాహోర్‌లో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఉన్నతాధికారులతో పీసీబీ సుదీర్ఘంగా జరిపిన సమావేశం అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ నెల 15న జరగనున్న ఈ హై-వోల్టేజ్ మ్యాచ్‌పై నెలకొన్న అనిశ్చితి ప్రపంచ క్రికెట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో ఐసీసీ డిప్యూటీ ఛైర్మన్ ఇమ్రాన్ ఖ్వాజా, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు అమీనుల్ ఇస్లాంతో కలిసి పీసీబీ ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ ఐదు గంటలకు పైగా చర్చలు జరిపారు. టోర్నమెంట్‌కే తలమానికమైన మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకోవడంతో సమస్యను త్వరగా పరిష్కరించాలని ఐసీసీ భావిస్తోంది. తుది నిర్ణయం తీసుకునే ముందు తమ దేశ ఫెడరల్ ప్రభుత్వాన్ని సంప్రదించాలని పీసీబీ యోచిస్తున్నట్లు సమాచారం. ఈరోజు నఖ్వీ మీడియా సమావేశంలో మాట్లాడే అవకాశం ఉందని, త్వరలోనే స్పష్టత వస్తుందని

అంచనా వేస్తున్నారు.కొలంబో వేదికగా ఈ నెల 15న భారత్‌తో జరగాల్సిన గ్రూప్ మ్యాచ్ ఆడబోమని ఈ నెల 2న పీసీబీ ప్రకటించడంతో వివాదం మొదలైంది. దీంతో ఐసీసీ రంగంలోకి దిగి అత్యవసరంగా చర్చలు ప్రారంభించింది. ఈ చర్చల్లో బంగ్లాదేశ్ బోర్డు పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చర్చల్లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ ఒకే వైఖరితో ఉన్నాయని ఇండియా టుడే తన కథనంలో పేర్కొంది.టోర్నమెంట్ షెడ్యూల్, పాలన, వాణిజ్యపరమైన ఒప్పందాలపై ప్రభావం పడకుండా చూడటమే ఐసీసీ ప్రధాన లక్ష్యంగా ఉంది. మరోవైపు చర్చల్లోని అంశాలను పీసీబీ ఛైర్మన్ నఖ్వీ, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు వివరించనున్నారు. ఇది కేవలం క్రికెట్‌కే పరిమితమైన అంశం కాదని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

# 3 నెలల తేడా.. రెండు చిత్రాలతో రౌడీ హీరో.. ఫ్యాన్స్ కి పండగే!





విజయ్ దేవరకొండ అభిమానులకు 2026 నిజంగా ఒక మెమొరబుల్ ఇయర్ కాబోతోంది. తనదైన మేనరిజంతో 'రౌడీ హీరో'గా ముద్ర వేయించుకున్న విజయ్, ఈ ఏడాది కేవలం మూడు నెలల వ్యవధిలోనే రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనున్నారు. భిన్నమైన కథా నేపథ్యాలు, క్రేజీ కాంబినేషన్లతో రాబోతున్న ఈ సినిమాల అప్‌డేట్స్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ ఏడాదంతా రౌడీ మేనియా కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.

**'రణబాలి'తో మళ్ళీ టాక్సీవాలా మ్యాజిక్:**

విజయ్ దేవరకొండ మరియు దర్శకుడు రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్లో గతంలో వచ్చిన 'టాక్సీవాలా' ఎంతటి విజయాన్ని అందుకుందో మనందరికీ తెలిసిందే. ఇప్పుడు వీరిద్దరూ కలిసి మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో 'రణబాలి' అనే ప్రతిష్టాత్మక సినిమాతో రాబోతున్నారు. ఈ సినిమాపై అంచనాలు పెరగడానికి మరో ప్రధాన కారణం, ఇందులో విజయ్ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుండటం. వీరిద్దరి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్ మరియు టీజర్ యూట్యూబ్‌లో రికార్డులు సృష్టిస్తూ ఫ్యాన్స్‌కు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. పక్కా కమర్షియల్ మరియు ప్యాషనేట్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రం సెప్టెంబర్ 11న థియేటర్లలో సందడి చేయనుంది.

**'రౌడీ జనార్ధన'.. రవికిరణ్ కోలా డ్రీమ్ ప్రాజెక్ట్:**

సెప్టెంబర్‌లో రణబాలి అల్లరి ముగియకముందే, డిసెంబర్ నెలలో 'రౌడీ జనార్ధన' సినిమాతో విజయ్ మరోసారి థియేటర్లకు రాబోతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి రవికిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నారు. ఇది రవికిరణ్ కోలాకు ఒక డ్రీమ్ ప్రాజెక్ట్ కావడంతో, ఆయన ఈ సినిమాను ఒక బ్లాక్ బస్టర్ ప్రామిస్‌తో తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్ కూడా పాన్ ఇండియా స్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించింది. రణబాలిలో ఒకలా కనిపిస్తే, రౌడీ జనార్ధనలో విజయ్ పూర్తి వైవిధ్యమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఇలా స్వల్ప వ్యవధిలో రెండు విభిన్నమైన పాత్రలతో మెప్పించడం విజయ్ దేవరకొండకే సాధ్యమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

**బాక్సాఫీస్ వద్ద రౌడీ హీరో ప్రభంజనం**

మొత్తానికి 2026లో విజయ్ దేవరకొండ తన సినిమాలతో టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద జాతర చేయబోతున్నారు. మూడు నెలల గ్యాప్‌లో రెండు భారీ ప్రాజెక్టులను రిలీజ్ చేయడం సాహసమే అయినా, ఆ సినిమాల కంటెంట్ మీద ఉన్న నమ్మకంతో చిత్ర యూనిట్ ముందుకు వెళ్తోంది. రాహుల్ సంకృత్యన్ మేకింగ్ స్టైల్, రవికిరణ్ కోలా విజన్.. ఈ రెండూ విజయ్ కెరీర్‌కు మరో మైలురాయిగా నిలిచేలా ఉన్నాయి. సెప్టెంబర్ మరియు డిసెంబర్ నెలలు రౌడీ ఫ్యాన్స్‌కు నిజమైన పండగను తీసుకురాబోతున్నాయి. ఈ రెండు చిత్రాలు విజయవంతమైతే విజయ్ దేవరకొండ పాన్ ఇండియా మార్కెట్ మరో స్థాయికి చేరుకోవడం ఖాయం.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965